1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

హైదరాబాద్

మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

అభినయ్ ప్రింటర్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ బాటిలింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అభినయ ప్రింటర్స్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం ప్రారంభించారు. ప్రింటర్స్ ప్రిపరేటరీ శశిధర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. నాణ్యతతో కూడిన పుస్తకాలను అచ్చువేయాలని ప్రజలకు మంచి పుస్తకాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహ, కిషోర్ హనుమంతరావు బాలరాజ్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు ప్రజా ఏక్తా పార్టీ మద్దతు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు ప్రజా ఏక్తా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సోమ వారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివా స్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసికి ఇవ్వడంతో పాటు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల ఉద్యోగ భద్రతపై మార్గ దర్శ కాలను నిర్దేశించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2021 జీతభత్యాల సవరణ, పీఎఫ్, సీసీఎస్ బకాయిలు చెల్లింపుల కోసం ఆర్టీసీ ఉద్యో గ సంఘాల జేఏసీ చేస్తున్న పోరాటానికి ప్రజా ఏక్తా పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా... పేదలకు, రైతులకు వ్యతిరేకంగా ఉంది
- ఇక్కడినుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు తక్షణమే నిధులు తెస్తారా లేక రాజీనామా చేస్తారా ఆలోచించుకోవాలి
- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరసన



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని, కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, ఆదానీ, అంబానీలకు అనుకూలంగా ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య అతిథిగా నాగయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందన్నారు. రైతులకు, కార్మికులతో పాటు పేద ప్రజానికానికి ఈ బడ్జెట్ వ్యతిరేకంగా ఉందన్నారు. వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి నిధుల కోత విధించారన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రయివేటీకరణకు పెద్దపీట వేయాలని కేంద్రం చూస్తోందన్నారు. బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐలు తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి రూ.47వేల కోట్ల వాటాలను ఉపసంహరించుకున్నారని, బీమా రంగాన్ని 100 శాతం ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. రైతులకు, ఆహార రంగాలకు ఇచ్చే సబ్సిడీలో సైతం కోత పెట్టారని, బీమారంగాన్ని ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్రాన్ని గద్దెదించాలన్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు చేసిందేమీలేదని, రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా తేలేని అసమర్థులన్నారు. ఇక్కడినుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు తక్షణమే నిధులు తెస్తారా లేక రాజీ నామా చేస్తారా ఆలోచించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్మిక, రైతులను విస్మరించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చా రని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. తెలంగాణలో ఉన్న వనరులను, ఖనిజ సంపదను కేంద్రానికి అప్పజేప్పాలని ఇక్కడున్న బీజేపీ ఎంపీలు చూస్తున్నారని మండిపడ్డారు. ఈ బడ్జెట్ కేవలం 40 శాతం మందికి అనుకూలంగా ఉందన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ.జ్యోతి మాట్లాడారు. 2025-26కు సంబంధించి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడాకార్పొరేట్ సంస్థలను కాపాడే విధంగా ఉందన్నారు. ఈ దేశ సామాన్యులను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌కు పూర్తిగా నిధులను తగ్గించారన్నారు. మౌలిక అంశాలు విద్యా, వైద్యం, తాగునీరు, రోడ్లతో పాటు తదితర అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలకు సంబంధించిన నిధుల కోత విధించారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం అనే హామీలను ఇచ్చారని, ఆ విభజన హామీల గురించి ఒక్క హామీ ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. ఆదిలాబాద్‌కు సంబంధించిన సీసీఎస్ ఫ్యాక్టరీ ఏమైందన్నారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీల నిర్మాణం, విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మన వాటా మనం సాధించుకునే విధంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణ నుంచి ఎంపికైన 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని అనుక్షణం మాట్లాడ్తారు కానీ, తెలంగాణకు కొన్ని నిధులైనా సాధించలేని అక్కడ ఉండి ఏం లాభమని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులను రాబట్టాని బీజేపీ ఎంపీలకు సూచించారు. వ్యవసాయ రంగంలో, కార్మిక రంగంలో ఉత్పత్తులను పెంచే విధంగా బడ్జెట్ ఉండాలన్నారు. మహిళలకు ఆహార భద్రత కొరవడిందన్నారు. మహిళలకు భద్రత కల్పించే విధంగాను, ఆత్మహత్యలు, వలసలను నిరోధించే పద్ధతిలో బడ్జెట్ ఉండాలన్నారు. బడ్జెట్‌లో మా నిధులు మేము రాబట్టుకునే విధంగా ప్రజలందరిని సమయుక్తం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవి కుమార్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కమిటీ చైర్మెన్ డీజీ నర్సిం హరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు కల్పించాలని, ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడి పోరాటాలు కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయం మీద సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షంలో అందరినీ కలుపుకుని తెలంగాణకు జరిగిన అన్యాయంపై పోరాడాలన్నారు. అవసరమైతే తెలంగాణ బంద్‌ను నిర్వహించి ఢిల్లీలోని మోడీ ప్రభుత్వం కండ్లు తెరిపించాలన్నారు. కేవలం మొక్కుబడి పోరాటాలతో కేంద్రం దిగొస్తుందనకుంటే పొరపాటన్నారు. హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, హైదరాబాద్ నుంచి మేడ్చేల్ వరకు మెట్రోరైలు ప్రాజెక్టు ఇవ్వొచ్చన్నారు. ఏం ఇవ్వకుండా తెలంగాణకు గుండుసున్నా చూపించారన్నారు. పాలమూరు, రంగారెడ్డికి మంచి ఇరిగేషన్ స్కీం ఉందని, దానికి జాతీయ హెూదా ఇస్తే తెలంగాణ మీద ఆర్థిక భారం తగ్గు తుందన్నారు. కేంద్ర మంత్రులు నిధులు తెస్తారా, రాజీనామా చేస్తారా అని నిలదీశారు. ముషీరాబాద్ నగర కమిటీ కార్యదర్శి ఆర్. వెంకటేష్ వందన సమర్పణ చేశారు. ఈ నిరసన కార్యక్ర మంలో పార్టీ రాష్ట్ర, కేంద్ర, నగర నాయకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ మోసపూరితమైనది

- అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్

నవతెలంగాణ-ముషీరాబాద్

నరేంద్ర మోడీ నాయకత్వను బీజేపీ కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ ఒక మోసపూరితమైనదని, రైతు వ్యతిరేకమైనదని, కార్పొరేట్ అనుకూలమైనదని ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ భావిస్తుందని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను రైతాంగం వ్యతిరేకించాలని కోరారు. ప్రస్తుతం సాగు సంక్షోభం పరిష్కరించడానికి అనువైన బడ్జెట్ ప్రతిపాదించాలని లేనియెడల ఆందోళన చేపడతామన్నారు. వ్యవసాయ అభివృద్ధి బడ్జెట్ రూపొందించి రైతాంగాన్ని అభివృద్ధి వైపు నడిపే విధంగా కేటాయింపులు చేయాలని లేనియెడల ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

కేంద్ర బడ్జెట్ దేశ సమైక్య స్ఫూర్తికి విఘాతం

- తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పత్రిక ప్రకటన ద్వారా అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని రాష్ట్రంలో నుంచి ఎన్నుకోబడిన బీజేపీ ప్రజాప్రతినిధులకు రాష్ట్రంలో ముఖం లేకుండా చేశారన్నారు. కేంద్రం ఇలాంటి మోస వైఖరి వలన పౌరులలో ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే భావన ఏర్పడిందని భారత జాతి సమైక్యతకు ఇది విఘాతం కలిగిస్తుందన్నారు. తెలంగాణ ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయినప్పుడు 52 :48 నిష్పత్తిలో అన్నిటి పంపకాలు జరిగినవి కానీ సముద్ర తీరంలో ఎలాంటి వాటా ఇవ్వలేదు కనీసం డై పోర్ట్ కొరకైన ఏపీలోని బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ డైపోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రూ.17వేల కోట్ల తెలంగాణ ప్రభుత్వం కోరిన కేంద్రం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి వివక్ష పాటించడం విచారకరమని తెలిపారు.

మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- రాష్ట్ర అధ్యక్షురాలు పాత మహాలమ్మ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వైద్య శాఖలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పబ్లిక్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్, పబ్లిక్ హెల్త్ నర్సస్ కమ్యూ నిటీ హెల్త్ ఆఫీసర్స్ ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పాత మహాలమ్మ అన్నారు. సోమవారం కోఠిలోని కార్యాలయంలో ఆమె మాట్లా డుతూ.. వైద్య శాఖలో అన్ని క్యాడర్లలో ప్రమోషన్ ల ప్రక్రియ వేగవంతం చేసిన డైరెక్టర్ ఆఫ్ హెల్ (డీహెచ్) డాక్టర్ రవీందర్ నాయక్‌కు అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళ ఆరోగ్య కార్యకర్తలపై ఉన్నటువంటి పని భారాన్ని తగ్గించాలన్నారు. ఆన్ లైన్ భారం తగ్గించి సబ్ సెంటర్లకు డీఇఓలను నియమించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యో గులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఏఎన్ఎంలకు ఎల్‌హెచ్‌వీ ట్రైనింగ్‌ను వీలైనంత త్వరగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వయోపరిమితి పెంచవద్దని యువతకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాన్ని వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని జరిగిన అన్యాయంపై ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు లేబర్ బోర్డ్ వైస్ చైర్మెన్ నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపులూరి కృష్ణ గౌడ్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు పథకాలకు నిధులు కోరితే కేంద్రం ఏ విషయంలో కూ డా సానుకూలంగా స్పందించలేదని, తీరని అన్యాయం చేసిం దని బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండుసున్నా మిగిలిందన్నారు. ఈ బడ్జెట్ పాన్-ఇండియా విధానాన్ని తీసుకోవడం కంటే రాబో యే ఢిల్లీ, బీహార్ ఎన్నికలపై ఎక్కువ దృష్టి పెట్టినట్లు కనిపిస్తోందన్నారు. అన్యాయంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వారి వెంట నాయకులు ధాత్రి క్ చందు లాల్ పటేల్, తోలుపునూరి నరేష్ గౌడ్ తదితరులున్నారు.

శానిటేషన్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎస్ఎఫ్ఏలకు

కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలి

సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, సహాయ కార్యదర్శి సి.మల్లేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

శానిటేషన్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎస్ఎఫ్ఏలకు కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, సహాయ కార్యదర్శి సి.మల్లేష్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీహెచ్ఎంసీ ప్రజావాణిలో సీఐటీయు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, సహాయ కార్యదర్శి సి.మల్లేష్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో శానిటేషన్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎస్ఎఫ్ఏల దాదాపుగా 900 మంది పని చేస్తున్నారని వీరు హైదరాబాదు నగర అభివృద్ధిలో హైదరాబాద్ శుభ్రతలో హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచడంలో వీరి కృషి అమోఘమైందన్నారు. హైదరాబాద్ నగరానికి అనేక అవార్డులు, రివార్డులు వస్తున్నాయంటే వారి పాత్ర ఉందని మున్సిపల్ కార్మికులతో పని చేయించడం, వారిని టైం కు హాజరు పరచడం, ఎక్కడ ఏ చెత్తాచెదారం ఉన్న వారితో వెంటనే క్లీన్ చేయించడం హైదరాబాద్ నగరం ని క్లీన్ గా, శుభ్రంగా ఉంచడం కోసం కృషి చేస్తున్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దె, స్కూలు ఫీజులు, పండుగలు ఖర్చులు పెరుగుతాయని వీరికి మాత్రం జీతాలు పెరగటం లేదు.. జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికుల శానిటేషన్, ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.35 వేలు పెంచాలని గత మూడు సంవత్సరాలుగా వివిధ సందర్భాలలో అధికారులకు ప్రభుత్వాలకు తెలియజేయడం జరిగిందని మరణించిన ఎస్ఎఫ్ఏల కుటుంబాల సభ్యులను తక్షణమే పనిలోకి తీసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలు పెంచాలని స్పెషల్ ప్రోగ్రామ్స్ సందర్భంగా కార్మికులను ఒక చోటు నుండి ఇతర చోటుకు తీసుకెళ్లడం కోసం ట్రాన్స్‌పోర్టు చార్జి ఇవ్వాలని, కార్మికులకు ప్రతి నెల రెండు కేజీల జాడు కట్టలు ఇవ్వాలని, ఎస్ఎఫ్ఐలకు పెట్రోల్ ఖర్చు ఇవ్వాలనీ, ముఖ్యమైన పండుగలు సందర్భంగా సెలవు ఇవ్వాలని, ఎస్ఎఫ్ఏలకు ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్‌లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. జీహె చ్ఎంసీ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గీతా రాధికకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అంబర్‌పేట జోన్ నాయకులు పి. శ్రీనివాస్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అంశంలో సీఎం రేవంత్ రెడ్డి బలి'

- మాల సంఘాల జేఏసీ చైర్మెన్ జి.చెన్నయ్య



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, బీజేపీ పార్టీ నేతలు ఆడుతున్న నాటకంలో రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి బలి కాక తప్పదని, తన సీఎం పదవికి ముప్పు వచ్చే ప్రమాదం ఉందని మాల సంఘాల జేఏసీ చైర్మెన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జి.చెన్నయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ 7న చేపట్టనున్న 'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు' కార్యక్రమం సందర్భంగా మాలలకు చావు డప్పులు కొడుతున్నామని చేస్తున్న ప్రచారాన్ని మాల సంఘాల జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కృష్ణ మాదిగ చావు డప్పులు కొట్టాల్సింది మాలలకు కాదని, ఆయనకు ప్రియ మిత్రులైన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, నిత్యం కాళ్ళు మొక్కె మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడులకు కొట్టాలని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అడ్డుకుంటున్నది మాలలు కాదని, నీవు నమ్ముకున్న నరేంద్రమోడీ, జి.కిషన్‌రెడ్డి, ఎం.వెంకయ్యనాయుడేనని ఆరోపించారు. వర్గీకరణకు హామీ ఇచ్చిన మోడీ చేయకుండా ఎందుకు వెనక్కి తగ్గారని, సుప్రీంకోర్టు తీర్పుకు, మోడీ ఇచ్చిన హామీకి సంబంధం లేదని, వర్గీకరణకు అడ్డుపడుతున్నది మోడీయేనని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ లో బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. కృష్ణ మాదిగ బీజేపీకి డప్పు కొడుతూ మాలలకు చావు డప్పు కొడతామంటే మాలలు చూస్తు ఊరుకోరని, కృష్ణ మాదిగ ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. వర్గీకరణ కావాలంటే పార్లమెంట్ ఎదుట నిరాహార దీక్షలు చేసి పార్లమెంట్ లో బిల్లు పెట్టించుకోవాలని, కానీ మాదిగలను తప్పుదారి పట్టించేందుకు మాలలపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు క్షమించారని హెచ్చరించారు. ప్రజా గాయకుడు గద్దర్ నక్సలైట్ అయినందువల్లనే పద్మశ్రీ ఇవ్వలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారని, ఒకప్పుడు కృష్ణ మాదిగ నక్సలైటేనని, ఆయనకు పద్మశ్రీ ఎలా ఇచ్చారని చెన్నయ్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాల సంఘాల జేఏసీ నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, బేరా బాలకిషన్, మందాల భాస్కర్, గోపతి రమేష్, జంగా శ్రీనివాస్, భుజంగరావు, నాను, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల రిజర్వేషన్లు పెంచేందుకు జీవో జారీ చేయాలి'



- నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మెన్ వీ.జీ.ఆర్ నారగోని

నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీసీలకు 25 శాతం నుంచి 44 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మెన్ వీ.జీ.ఆర్.నారగోని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారగోని మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించిన బీసీల జనాభా లెక్కల నేపథ్యంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 25 శాతం నుంచి 44 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని, అందుకు జీవో జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతంకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో జారీ చేయాలని కోరారు. ఈ లెక్కలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వేనని, ఈ రెండు అంశాలపై అసెంబ్లీలో చర్చించి జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫ్రంట్ నాయకులు కె.బి.శ్రీధర్, జెఎల్. ఆశీర్వాదం, మీనుగ గోపి, కుడువుడి మహేశ్వర్ రావు, లక్ష్మణ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-అంబర్‌పేట

వసంత పంచమిని పురస్కరించుకొని అంబర్‌పేట మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఈ సంద ర్భంగా ఆలయ నిర్వాహకులు ఎడ్ల సుధాకర్ రెడ్డిని సన్మానించారు.

7న సమ్మె నోటీసు ఇవ్వనున్న టీజేఎంయూ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం సంబంధించిన డేటాఫ్ అపాయింట్‌మెంట్, యూనియన్‌ల అను మతి, వేతన సవరణతో పాటు ఇతర సమస్యల సాధన కోసం ఈనెల 7న సమ్మె నోటీసు ఇవ్వాలని టీజీఎస్ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) రాష్ట్ర కమిటీ నిర్ణయిం చింది. ఈమేరకు సోమవారం ఆ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ఏకైక ఎజెండాతో 2017లో టీజేఎంయూ ఆవిర్భవించిందనీ, రాష్ట్రంలోని 97 డిపోలలో కార్మిక చైతన్య యాత్ర కొనసాగించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా ఆర్టీసీలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలనీ కోరుతూ టీజేఎంయూ ఆధ్వర్యంలో ఈనెల 7న శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బస్ భవన్ యందు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వనున్నామని హనుమంతు ముదిరాజ్ చెప్పారు. సమ్మె నోటీసు ఇస్తున్న సందర్భంగా రాష్ట్రంలోని అన్ని డిపోలలోని కార్మిక సోదర, సోదరీమణులందరూ పెద్దఎత్తున తరలివచ్చి.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

మంచినీటిలో కలుషిత నీరు రాకుండా నీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్ నగర్ ఐస్ ఫ్యాక్టరీ గల్లీలో స్థానిక అధికారులతో అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పర్యటించి ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తీ ప్రజలతో కలిసి కలుషిత మంచినీటి సమస్యని పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సమస్యని వివరించి, సమస్య పునారావృతం కాకుండా నూతన మంచినీటి పైప్‌లైన్‌కు కావాల్సింటునటువంటి చర్యలు తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, లైన్మెన్ రాజేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అబ్దుల్ మాలిక్, మోహన్, శ్రీనివాస్,సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు..



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వేను విజయంతగా పూర్తి చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాలలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ ఫైనాన్స్ కమిటీ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని..
- ప్రజావాణికి 1975 దరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో ప్రజలు అందచేసిన అర్జీలను సత్వరమే పరి ష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుంద రెడ్డి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తు లను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి 1975 దరఖాస్తులు అందాయని తెలిపారు. సదరు అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజావాణిలో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖవి 1279, రేషన్ కార్డుల కోసం 563, పెన్షన్ 33, డీఈవో 07, రెవెన్యూ 07, పౌర సరఫరాలు 7, మైనార్టీ శాఖ 04, విక లాంగుల శాఖ 04, సీపీవో 01, జీహెచ్ఎంసీ 02, ఇతర శాఖలకు సంబంధించినవి 68 దరఖాస్తులు అందాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఈ. వెంకట చారి, ఆర్డీ వో సాయిరాం, జిల్లా అధికారులు ఆర్. రోహిణి, జి ఆశన్న, పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌వో వెంకటి, సుబ్ర హ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్, పార్క్‌లకు శంకుస్థాపన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్, సోమవారం వెంగళరావు నగర్ డివిజన్ మధురనగర్ జి బ్లాక్‌లో రూ.15 లక్షల 50 వేల వ్యయంతో ఓపెన్ జిమ్, పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యా రావు, జీహెచ్ఎంసీ డీఈ రామచంద్రరావు, యూబీడీ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ చంద్ర, సానిటరీ సూపర్‌వైజర్ విజయ్ కుమార్, మధుర నగర్ కాలనీ ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డి, సాంబశివ రావు, సుగుణ, పద్మావతి, విజయవాణి, మనోహర్రావు, రేలంగి నరసింహారావు, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో క్లీనింగ్ పనులు చేయించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి ముస్లిం గ్రేవి శ్మశాన వాటికలో సోమవారం కార్పొరేటర్ ముద్దం నరసింహా యాదవ్ సొంత నిధులతో క్లీనింగ్ పనులను చేయించారు. ఇందులో భాగంగా ఆయన శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ముస్లిం అధ్యక్షుడు ఇర్ఫాన్ బాయ్, ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు మజార్ హుస్సేన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడికక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజల సమస్య పరిష్కారానికి అధికారులు విశేష కృషి చేయాలన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలపై ఎన్ని రోజుల్లో పరిష్కారం చేస్తారో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని అధికారులను ఆదేశించారు. నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌తో పాటుగా టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు, అడిషనల్ కమిషనర్ లకు తమ అర్జీలను అందజేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 44 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 22, ట్యాక్స్, ఎఫ్.ఏ విభాగాలకు 4 చొప్పున, ఇంజినీరింగ్ (మెయింటెనెన్స్) 3, శానిటేషన్, వెటర్నరీ, ఎస్టేట్స్, హౌసింగ్ విభాగాలకు రెండు ఫిర్యాదుల చొప్పున రాగా, ల్యాండ్ అక్విజిషన్, అడ్మిన్, యూబీడీ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు శివ కుమార్ నాయుడు, యాదగిరి రావు, గీత రాధిక, అడిషనల్ సీసీపీ గంగాధర్, ప్రదీప్, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ, హౌసింగ్ ఎస్ ఈ కష్టారావు, ఈ ఈ రాజేశ్వర్ రావు, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, ఓఎస్ డి అనురాధ, ఏ ఎం సీ లు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట్ మున్సిపల్ కబేలా లీజ్ గుడువు ముగిసింది

- పాత కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తే జీహెచ్ఎంసీ ఆదాయానికి తీవ్ర నష్టమే
- వెంటనే టెండర్లు పిలువాలని సీపీఐ(ఎం) డిమాండ్
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంబర్‌పేట్ మున్సిపల్ కబేలా లీజ్‌గడువు ముగిసి 10నెలలు గడిచిందని, వెంటనే టెండర్లను పిలువాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ సెక్రటేరియట్ సభ్యులు ఎం.శ్రీనివాస్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భండగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంబర్‌పేట్ మున్సిపల్ కబేలా లీజ్‌గడువు ముగిసి 10నెలలు గడిచిందన్నారు. 2024లో లీజ్‌గడువు ముగినప్పటికీ కొత్త టెండర్లను పిలువకుండా పాత రేట్ల ప్రకారమే పాత కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తున్నారన్నారు. దాంతో జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయం కోల్పోతుందని తెలిపారు. ప్రతిఏటా లీజ్ కాంట్రాక్టర్ 10శాతం పెంచుతున్నారని, 2021-22లో 1.21కోట్లు చెల్లించగా, 2022-23లో రూ.1.33కోట్లు, 2023-24లో రూ.146 కోట్లు చెల్లించారని తెలిపారు. అయితే ఈ ఏడాది ఏ మాత్రం చెల్లించకుండా గతేడాది చెల్లించిన డబ్బులను మాత్రమే తిరిగి ఈ ఏడాది చెల్లించాడని గుర్తు చేశారు. కొందరు అధికారపార్టీ నాయకుల ఒత్తిడి కారణంగా టెండర్లను పిలువకుండా పాత (అల్ ఆహద్ ఎక్స్ పోర్ట్ ప్రయివేట్ లిమిటెడ్)కు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. 2024 ఏప్రిల్‌లో కాంట్రాక్టు గడువు ముగియడానికి ముందే టెండర్స్ పిలువకపోగా, మే నెలలో పార్లమెంట్ ఎన్నికల కారణంగా టెండర్స్ పిలవలేకపోయామని స్వయంగా అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఆరు నెలల లీజ్ పొడిగించినప్పటికీ 10 నెలలు గడిచినా నేటికీ టెండర్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రానందువల్లా టెండర్ వేయలేకపోతున్నామని అధికారులు చెపుతున్నారని ఇది సమంజసంగా లేదన్నారు. ఇంకెంతకాలం పాత కాంట్రాక్టర్‌నే కొనసాగిస్తారన్నారు. జీహెచ్ఎంసీ ఆదాయానికి నష్టం చేస్తున్న ఈ కాంట్రాక్ట్‌ను తక్షణమే నిలిపివేయాలని, కొత్త టెండర్లను వెంటనే వేయాలని డిమాండ్ చేశారు.

టీఎల్‌ఎఫ్ క్యాలెండర్స్ విడుదల చేసిన స్పీకర్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్ఎఫ్) డైరీ, క్యాలెండర్‌ను తెలంగాణ శాసన సభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎల్ఎఫ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. టీఎల్ఎఫ్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమ సంస్థ అని, తెలంగాణ అభివృద్ధిలో మీ వంతు పాత్రను నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా టీఎల్ఎఫ్ సభ్యులు అధ్యాపకుల సమస్యలు స్పీకర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిద్దేశ్వర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ యాదయ్య, వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు గడ్డం రామచందర్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పట్లోల తిరుపతి రెడ్డి, టీఎల్ఎఫ్ నాయకులు ఎండీ పర్వేజ్, రఘురాం రెడ్డి, బాబులాల్ టీఎల్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, మంత్రి తలసాని యాదవ్ ఆదేశాలు మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నూతన డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ ఖైరతాబాద్ నియోజకవర్గం డివిజన్‌ల వారీగా ఉన్న డివిజన్ ముఖ్య నాయకులకు, డివిజన్‌ల అధ్యక్షులకు, డైరీ, క్యాలెండరులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ హేమలత, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షులు జెజోల రాజు, ఖైరతాబాద్ డివిజన్ నాయకులు తాండ్ర మేఘన, సోమాజిగూడ నాయకులు రూపేష్ యాదవ్, జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు శంకర్, సుజాత, హీనా, మురకొండ వెంకటేష్, రమేష్, హైమత్ అలీ, అబ్దుల్ వహీద్, ఎండీ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద మోడీ దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం చేసిందని, రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు ఎక్కువ మంజూరు చేసి, తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా మోసం చేశారని, రాష్ట్రంలో కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ కేంద్ర మంత్రులు ఉండి ఎలాంటి నిధులు తేలేదని, అందుకు పూర్తి బాధ్యత వహించి ఇద్దరు కేంద్ర బీజేపీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి నిధులు వచ్చిన రాకపోయినా, కాంగ్రెస్ పరిపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అందరికీ న్యాయం చేసి ముందుకు తీసుకువెళ్తామని సీఎన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనేకమంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లో విద్య, వైద్య సేవలకు స్థానిక శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నారని సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు, బీఆర్ఎస్ యువ నేతలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ డివిజన్‌ల వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం సితాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కంది శైలజ, రాసూరి సునీత రమేష్, లింగాని ప్రసన్న లక్ష్మి, బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని రూ.6 లక్షల విలువ జేసే 23 చెక్కులను, రూ.2 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను రోగులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ప్రజలు తమ అవసరాలకు సితాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

'వేల గొంతులు లక్షల డప్పులు' మాదిగ సభను విజయవంతం చేయండి



- విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7న ఛలో హైదరాబాద్ "వేల గొంతులు లక్షల డప్పులు" కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వాల్ పోస్టర్‌ను వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఎమ్మార్పీ ఎస్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షతన జరుగగా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు రాజ్యాంగ విస్తృత ధర్మాసనం మాదిగ, ఉప కులాల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణను అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని, లేకపోతే విద్యా ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతారని, దశాబ్దాలుగా జరిగిన అన్యాయమే మళ్ళీ జరగకుండా చూడాలని కోరారు. ఈ సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయడం కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగ విద్యార్థిని విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, మొదటి నుండి ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలిచిన వివిధ విద్యార్థి సంఘాలు క్రియాశీలకంగా భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ, ఓయూ యుద్ధనౌక వరంగల్ రవి, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ, జాతీయ కార్యదర్శి డా. పల్లెర్ల సుధాకర్ మాదిగ, టీఎస్సీ జాక్ ఫౌండర్ వలిగొండ నరసింహ, డీబీఎస్‌ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, డీబీఎస్‌ఏ రాష్ట్ర అధికార ప్రతినిధి కాసర్ల మధుసూదన్, ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాపారావు, రాష్ట్ర నాయకులు అరుణ్ ఆదివాసీ ఎఐఎస్ఎఫ్ ఓయూ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

దేవాలయంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా తిరుమలగిరి సూర్య భగవానుడి దేవాలయంలో చేస్తున్న ఏర్పాట్లను కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ సోమవారం అధికారులు, స్థానికలో కలిసి పరిశీలించారు. నిర్వహకులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన్న ప్రతాప్, సీనియర్ నాయకులు మురళీ ముదిరాజ్, ఆలయ నిర్వాహకులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మోడీ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిందని, దీనికి సంబంధించి తెలంగాణాకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని నిరసన తెలుపుతూ వీకర్ సెక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మోడీ దిష్టిబొమ్మను బోరబండ కార్పొరేటర్ సతీమణి హబీబా సుల్తానా ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. బీజేపీ డౌన్ డౌన్, మోడీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ నాయకులు, యువకులు, మహిళలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాసుల మహేష్, మున్నా, కృష్ణ, రజి, రంగ నాయక్, చెట్టి దేవేందర్, జీవన్ నాయక్, మున్ని బేగం, లక్ష్మి నాయక్, హిదాయత్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.కుమార్ సోమవారం పలువురికి ప్రమోషన్స్ అందజేశారు. ఫైనాన్స్ ఆఫీసర్ 1, జాయింట్ రిజిస్ట్రార్ 1, డిప్యూటీ రిజిస్ట్రార్ 1, అసిస్టెంట్స్ రిజిస్ట్రార్స్ 2 కి నియమక పత్రాలు అందజేశారు. నవతెలంగాణ-ఓయూ

స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బోధకుల అభివృద్ధి కార్యక్రమం

నవతెలంగాణ-ఓయూ

స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో సోమవారం బోధకుల అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 7 వరకు ఈ కార్యక్రమం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ గణిత విభాగం మాజీ హెడ్ ప్రొ.ఎస్. కిషన్ హాజరయ్యారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డా. కే ఎల్ వసుంధర స్వాగతోపన్యాసంలో మాట్లాడుతూ. క్వాంటం కంప్యూటింగ్ అభివృద్ధి చెందుతున్న రంగం. ఇది క్వాంటం మెకానిక్స్ సూత్రాలను ఉపయోగించి గణనాత్మక పరిష్కారాలను అందిస్తుందన్నారు. గణిత శాస్త్రం అల్గారిథమ్స్‌ని రూపొందించడం, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి అంశాలకు సాంకేతిక మద్దతును ఇస్తోందన్నారు. విజ్ఞాన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. అనురాధ మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్‌లో గణితశాస్త్రము కీలక పాత్ర పోషిస్తుందని, ఇది క్వాంటం మెకానిక్స్‌ను అర్థం చేసుకోవడానికి, క్వాంటం సర్క్యూట్లను రూపొందించడానికి, శక్తివంతమైన అల్గారిథమ్స్ అభివృద్ధి చేయడానికి సహాయపడుతోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సత్యప్రసాద్ లంక మాట్లాడుతూ.. గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలు అభివృద్ధి అవ్వడానికి ఎంతగానో సహకరించిందని చెప్పారు. క్వాంటం టెక్నాలజీలో గణితశాస్త్రం ప్రధానమైన భూమికను పోషిస్తుందని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో పనిచేయాలనుకునే వారికి గణిత శాస్త్రంలో బలమైన పట్టు ఉండడం ఎంతో అవసరమన్నారు. ముఖ్య వక్తగా హాజరైన ఓయూ ప్రొ. ఎస్ కిషన్ మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్ అనేది గణనాత్మక శక్తిలో విప్లవాత్మక మార్పులను తెచ్చే సాంకేతికత ఇది సూపర్ పొజిషన్ ఎంట్యాంగిల్‌మెంట్ వంటి క్వాంటం మెకానిక్స్ నిబంధనలను ఉపయోగించి క్లాసికల్ కంప్యూటింగ్‌తో సాధ్యం కానీ వేగవంతమైన, సమర్థవంతమైన పరిష్కారాలను అంది స్తుందని చెప్పారు.



క్వాంటం కంప్యూటింగ్ సహాయం తో ఔషధ పరిశోధన, పదార్థ శాస్త్రం మొదలగు రంగాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమానికి మరొక ముఖ్య వక్తగా హాజరైన డా.షేక్ అహ్మద్ (ఓక్షన్ యూనివర్సిటీ, హైదరాబాద్) మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్ శబ్ద సంకేతాల గతి విధానాలు, క్వాంటం యాదృచ్ఛిక సంఖ్య ఉత్పత్తి టెక్నాలజీలు అనేక పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులను తెచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ టెక్నాలజీలు సైబర్ సెక్యూరిటీ, ఆరోగ్య సంరక్షణ, రక్షణ, బయోమెడికల్ పరిశోధనలు, నానో టెక్నాలజీ వంటి రంగాలలో అసాధారణ ప్రయోజనాలను అందించగలవని పేర్కొన్నారు. ముఖ్య వక్తలైన ప్రొ. ఎస్ కిషన్, డాక్టర్ షేక్ అహ్మద్ అధ్యాపక బృందం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే ఈ బోధకుల అభివృద్ధి కార్యక్రమానికి కన్వీనర్ అయిన డా. మైత్రేయి వందన సమర్పణ చేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కే. కృష్ణారావు, మేనేజ్మెంట్ సభ్య లు టి రాకేష్ రెడ్డి, ఆర్ ప్రదీప్ రెడ్డి, కళాశాల డీన్ ప్రొ. వినయ్ బాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేష్, గణిత విభాగ అధ్యాపకులు కన్వీనర్స్ డా.కె ఎల్.వసుంధర, డా.వి.మైత్రేయి, డా. శిరీష, డా. విద్యా భార్గవి, అనూష, సాయిరాం, విభాగాధిపతులు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత గర్భాశయ క్యాన్సర్ టీకా డ్రైవ్ ప్రారంభం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన, నివారణే లక్ష్యంగా అపోలో క్యాన్సర్ సెంటర్స్ క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత టీకా డ్రైవ్‌ను జూబ్లీహిల్స్‌లోని అపోలో క్యాన్సర్ సెంటర్‌లో ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ప్రారంభించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ఫిబ్రవరి 4న పురస్కరించుకొని ఈ డ్రైవ్‌కు అంకురార్పణ చేయానున్నారు. చేశారు. ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని అపోలో క్యాన్సర్ సెంటర్లలో ఫిబ్రవరి నెల అంతా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహిళలకు ఉచితంగా హెచ్పీవీ టీకాలు వేయనున్నారు. హైదరాబాద్‌లోని అనాథ ఆశ్రమాలలో ఉన్న యువతులకు ఎటువంటి ఖర్చు లేకుండా వ్యాక్సిన్‌ను అందజేయనున్నారు. ఈ సందర్భంగా సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంతో నేను అనుబంధం అయినందుకు గర్వంగా అనిపిస్తుందన్నారు. ఎందుకంటే ఇది నా మనసుకు ఎంతో దగ్గరైన అంశమన్నారు. మహిళలలో అత్యంత సాధారణంగా కనిపించే క్యాన్సర్‌ల్లు బ్రెస్ట్ క్యాన్సర్,



సర్వికల్ క్యాన్సర్ అన్నారు. ఇవి చాలా వరకు నయం చేయదగినవే అయినా, మహిళల్లో అవగాహన లోపం ఉందన్నారు. ఈ వ్యాధులు నయం చేయగలమనే విషయం తెలియక, ఆరోగ్యకరమై కొనసాగించలేకపోతున్నారని తెలిపారు. అపోలో హాస్పిటల్స్, క్యూర్ ఫౌండేషన్ ఈ మానవతావాద వైద్యులు ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకు వస్తున్నారని చెప్పారు. క్యాన్సర్ గురించి ఉన్న అపోహలను తొలగించడం చాలా కష్టమని తెలుసన్నారు. కానీ, అవగాహన పెంచి, ఈ భయంకరమైన వ్యాధిని అధిగమించేందుకు అందరం కలిసి కృషి చేయాలన్నారు. క్యాన్సర్‌ను నిరోధించడంలో తొందరగా గుర్తించి చికిత్స చేయించడంలో మరింత ముందడుగు వేయాలన్నారు. ఈ సందర్భంగా అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రత్యేక అతిథి, జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, జాతీయ స్విమ్మర్, దంత వైద్యురాలు, సినీ నటి మీనాక్షి చౌదరి క్యాన్సర్ అవగాహనను పెంపొందించడానికి, మా క్యాన్సర్ సేవా కార్యక్రమాలు ప్రోత్సహించేందుకు మా బ్రాండ్ అంబాసిడర్‌గా సహాయపడాలని కోరారు. క్యాన్సర్ నివారించదగినదేనన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స చేయదగినదేనన్నారు. తొందరగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయగలమన్నారు. అవగాహన కార్యక్రమాలు క్యాన్సర్‌పై భయం తొలగించనున్నాయన్నారు. తొలి దశలోనే గుర్తించి చికిత్స పొందేలా ప్రోత్సహిస్తాయని తెలిపారు. ఆలస్యమైన దశల్లో కూడా క్యాన్సర్‌ను నియంత్రించి మంచి జీవితాన్ని కొనసాగించే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో క్యాన్సర్ అత్యంత సాధారణ వ్యాధిగా మారే అవకాశం ఉందని తెలిపారు. అందుకే క్యాన్సర్ లక్షణాలు, సూచనలు ఏమిటో.. తెలుసుకొని వైద్య సహాయం తీసుకోవాలన్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం 9 నుంచి 26 ఏండ్ల వయస్సున్న బాలికలకు ఉచితంగా సర్వికల్ క్యాన్సర్ వ్యాక్సిన్ అందిస్తామని చెప్పారు. కానీ, ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయడానికి సమయం పడుతుందన్నారు. అందువల్ల, హైదరాబాద్, సికింద్రాబాద్‌ని అనాథ బాలికలకు ఉచితంగా ఈ వ్యాక్సినేషన్ అందించేందుకు ముందుకు వచ్చామని చెప్పారు. ఇతర వర్గాల ప్రజల్లో కూడా ఈ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలలో అత్యధికంగా గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లు ఉన్నాయన్నారు. మహిళల క్యాన్సర్లలో 50 శాతం ఈ రెండు రకాల క్యాన్సర్‌లేనన్నారు. భారతదేశంలో క్యాన్సర్ ఉన్న 20 శాతం మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని చెప్పారు. ఇది ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తుందన్నారు. రొమ్ము క్యాన్సర్ మొత్తం మహిళల క్యాన్సర్లలో 30 శాతం అన్నారు. ఇది ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో కనిపిస్తుందని తెలిపారు. ఈ ఉచిత టీకా డ్రైవ్ ద్వారా సమాజంలో క్యాన్సర్ వ్యాప్తిని తగ్గించడం, ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నివారించగలమన్న ఆశతో ఉన్నామన్నారు. .

కష్టపడే తత్వం సుస్థిరమైన జీవితానికి నిదర్శనం

- మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్

నవతెలంగాణ-బంజారాహిల్స్



కష్టపడే తత్వం ఉంటే ఏ రంగంలోనైన రాణించగలమని, సుస్థిర జీవితానికి నిజమైన నిదర్శనమని మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్ అన్నారు. యువ వ్యాపారులు వెంకట భానుప్రకాష్, విష్ణుప్రియలు జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 45లో ఏర్పాటు చేసిన అనంత జ్యువెలరీ షోరూంను ఏపీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ రేఖా రాణితో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదిమందికి ఉపాధి కల్పించాలన్న ఆకాంక్ష, అభివృద్ధి సాధించాలన్న సంకల్పం ఉంటే అభివృద్ధి సాధించగలరని అన్నారు. అనంత జ్యువెలరీలో సాంప్రదాయ ఆధునిక మేళ వింపుతో ఏర్పాటు చేసిన ఆభరణాలు మహిళలకు మగువులకు మరింత అందాన్ని తెచ్చిపెడతాయని తెలిపారు. రాబోయే తరానికి మన సంస్కృతి సాంప్రదాయలతో పాటు గౌరవప్రదమైన కీర్తిని పొందాలంటే హస్తకళను కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భానుప్రకాష్, విష్ణుప్రియల కుటుంబ సభ్యులతో పాటు వారి స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్‌ను కలిసిన ఆదిలక్ష్మీ



నవతెలంగాణ- మేడ్చల్

కాంగ్రెస్ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలిగా ఇటీవల నియమకమైన బొజ్జ ఆదిలక్ష్మీ సోమవారం మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్‌ను మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె కమిషనర్‌కు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూత్ అధ్యక్షుడు నవీన్ ముదిరాజ్, నాయకులు కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ వసంతకు శుభాకాంక్షలు



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ నూతన కమిషనర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన వసంతను మున్సిపల్ కార్యాలయంలో మాజీ మేయర్ మేకల కావ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండల్ ముదిరాజ్, ఆలూరి సంగీత రాజశేఖర్, జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి, మేక లలిత యాదవ్, గండి రాంచందర్, బండ కింది ప్రసాద్ గౌడ్, జక్కుల భాస్కర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తేనే గుర్తింపు



- ఓబీసీ సెల్ చైర్మెన్ పసుపులేటి వీర భాస్కరరావు

నవతెలంగాణ - జవహర్‌నగర్

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తేనే గుర్తింపు, అవకాశం కల్పిస్తుందని జవహర్ నగర్ ఓబీసీ సెల్ చైర్మెన్ పసుపులేటి వీరభాస్కరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..25 ఏండక్లుపైగా కాంగ్రెస్ పార్టీకి పని చేసినందుకు తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పెద్దల అడుగుజాడల్లో నడుస్తూ పార్టీకి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. జవహర్ నగర్‌లో గతంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బీసీ కమిటీలన్నీ రద్దు అయ్యాయని, నూతన కమిటీలో పదవులకు అర్హత కలవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్పొరేట్ల అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకించండి

- సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకులు, మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

2025- 26 ఏడాదికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని, ఈ బడ్జెట్‌ను సామాన్య ప్రజలు వ్యతిరేకించాలని, సామాన్య ప్రజానీకాన్ని, కార్మికులను ఎంతో నిరాశపరిచిందని సీఐటీయూ జిల్లా నాయకులు బంగారు నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బడ్జెట్‌ను నిరసిస్తూ మల్కాజిగిరిలో నిరసన చేపట్టి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. బడ్జెట్ మీద ఎన్నో ఆశలతో ఉన్న ప్రజలను, కార్మికులను నిరాశపర్చిందన్నారు. ఎప్పటినుంచో పెట్రోల్, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకుంటారని ఆశిస్తున్న ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు.పెరుగుతున్న నిరుద్యోగం మీద బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కేటాయింపుల విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ధరల నియంత్రణ విషయంలో ఎలాంటి హామీ ఇవ్వకపోవడం ప్రజలను నిరాశపరిచిందన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్డిఐలను 74 శాతం నుంచి 100శాతం పెంచటం వల్ల ఇన్సూరెన్స్ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్స్ దృష్టిలో పెట్టుకుని బీహార్ రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు బాగానే నిధులను కేటాయించారని తెలిపారు. తెలంగాణకు మహానగరమైన హైదరాబాద్‌కు బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపించారని, మద్దతు ధరకై పోరాడుతున్న రైతుల విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. మధ్యతరగతి వాళ్లకు టాక్స్ విషయంలో ఆశించిన స్థాయిలో టాక్స్ లేదని, బడ్జెట్ మొత్తంగా చూసుకుంటే కార్పొరేట్లకు అనుకూలంగా ప్రజలకు, కార్మికులకు, రైతులకు, విద్యార్థులకు, కూలీలకు వ్యతిరేకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 61 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డీఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 61 ఫిర్యాదులు అందినట్టు వారు తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

హ్యూండయ్‌లో మరో ఎలక్ట్రికల్ కారు



- ప్రారంభించిన సీఈవో అనిత ప్రసాద్

నవతెలంగాణ-బోడుప్పల్

మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాలను కస్టమర్లు అందించడమే తమ లక్ష్యమని ప్రముఖ వాహనాల తయారీ షోరూం సీఈవో అనిత ప్రసాద్ అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని హ్యూండయ్ షోరూంలో నూతన ఎలక్ట్రానిక్ క్రేటా వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హ్యూండయ్ షోరూంలో నూతనంగా తీసుకువచ్చిన క్రెటా వాహనంలో అనేక అధునాతన సదుపాయాలు ఉన్నాయని అన్నారు. కాలుష్య రహితమైన ఈ వాహనంలో అత్యాధునిక పికప్ కలిగి ఉన్న ఈ వాహనంలో కేవలం 80 నిమిషాల్లో బ్యాటరీ ఛార్జింగ్ అవుతుందని తెలిపారు. ఈ వాహనంలో ఒక్కసారి రీఛార్జి అయితే 475 కిలోమీటర్లు మైలేజ్ వస్తుందని తెలిపారు. ఈ వాహనం ఖరీదు సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని షోరూం మేనేజర్ లక్ష్మణ్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



నవతెలంగాణ-ఉప్పల్

కేంద్ర, ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, కార్పొరేట్లకు దన్నుగా ఉందని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం. వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె. వెంకన్నలు అన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఉప్పల్ రింగ్ రోడ్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం) నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్మికులకు వ్యతిరేకంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. నాగరాజు, ఊర్మిళ, ఉపేందర్, వై. వెంకటేశ్వర్లు, జె.పట్టాభిరామయ్య, వెంకటేష్, మురళీమోహన్, ఆంజనేయులు, రవి, శ్రీనివాస్, ఉపేందర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన గ్రామ కంఠం భూమిని కాపాడాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ చందుపట్ల గూడలోని గ్రామకంఠం స్థలానికి కొందరు అక్రమార్కులు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని గ్రామస్తులు తెలిపారు. సర్వే నంబర్ 199 భూమికి సంబంధించిన పట్టదారులు అక్రమంగా ఫెన్సింగ్ వేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేండ్లుగా గ్రామస్తులు వివిధ పండుగలు, ఇతర కార్యక్రమాలకు వినియోగించుకుంటున్న ఈస్థలంపై పక్కన ఉన్న పట్టదారులు కన్నేసి ఆక్రమించుకున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో వేసిన భూగర్భ డ్రెయినేజీ, వీధిలైట్లు కూడా పట్టదారులు వేసిన ఇనుప ఫెన్సింగ్ లోపల ఉన్నాయని, బొడ్రాయి చుట్టూ బోనాలతో తిరగకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు విచారణ జరిపి గ్రామకంఠం స్థలాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ పైప్‌లైన్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటాం



- ఇరిగేషన్ ఏఈ నిఖిత

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని నూతన్‌కల్ గ్రామంలో ఇరిగేషన్ నాలా పక్క నుండి వేసిన టోరంటో గ్యాస్ పైప్ లైన్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ నిఖిత సోమవారం తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి ఓ సీడ్ కంపెనీకి ఇరిగేషన్ నాలా పక్కన నుండి టోరెంటో గ్యాస్ పైప్‌లైన్ వేస్తున్నారు. కాగా సంబంధిత శాఖ నుండి ఎన్వోసీ తీసుకోలేదు. ఇదే విషయమై మండల ఇరిగేషన్ ఏఈ నిఖితను వివరణ కోరగా తమ శాఖ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని చెప్పారు. అట్టి గ్యాస్ పైప్‌లైన్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. ఇటీవల ఆదారి గుండా వేస్తున్న గ్యాస్ పైప్ లైన్ ఏర్పాటును పలువురు రైతులు వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్మికులకు వ్యతిరేకం

- సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్



నవతెలంగాణ-చర్లపల్లి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని నిరాశకు గురిచేసిందని, కార్మికులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ అన్నారు. బడ్జెట్‌పై ఆయన సోమవారం మాట్లాడుతూ.. బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయించి, తెలంగాణకు తెడ్డు చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రజలు, రైతాంగం, కార్మికవర్గం తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రాష్ట్రంలో అనేక ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ఐటీఐఆర్ కారిడార్‌పై ఈ బడ్జెట్‌లో ఆశ లేకుండా చేశారని తెలిపారు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ చర్చ లేకుండా వదిలేశారని చెప్పారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని గుర్తు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీలోకి తేలేదని, నిరుద్యోగంపై ప్రస్తావన లేదన్నారు. ధరల నియంత్రణకు ఎలాంటి పరిష్కారం లేకుండా బడ్జెట్ ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించలేదని తెలిపారు. ఇది రైతాంగం నడ్డి విరచడం కాదా అని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నిధులు పెంచలేదన్నారు. అందుకే ఈ బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, పేదలకు, కార్మికలకు, రైతాంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ



- కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వసంత పంచమిని పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్‌లోని అంబా భవాని ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొని విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మంచి మనసుతో పేద విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేయడం మంచి పరిణామమని ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు కిట్టు, నాగభూషణం, నర్సింగ్ రావు, వెంకటేష్, పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజావాణిలో కార్పొరేటర్ ఫిర్యాదు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరిలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కారించాలని మల్కాజిగిరి జీహెచ్ఎంసీ డీసీ రాజుకు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పలు ఇంజనీరింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఆస్తి వివరాల్లో అనేక మంది పేర్లు సరిగ్గా ఉండక ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొంత మంది సిబ్బంది ఉద్దేశపూర్వకంగా రోహింగ్యలకు, ముస్లింలకు ఇక్కడ ఓటు హక్కు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంపై విచారణ చేయించాలని కోరారు. సఫిల్ గూడలోని ట్యాంక్ బండ్‌పైన నూతన టాయిలెట్స్ నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటైజేషన్, హార్టికల్చర్ విభాగం అధికారులు, రవి, నందు యాదవ్, అనిత, కౌశిక్, నాగరాజ్, రామకృష్ణ, పాల్గొన్నారు.

కబరస్థాన్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం



- కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ చౌరస్తాలోని ముస్లింల కోసం కబరస్థాన్‌లో వసతులు కల్పిస్తామని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. సోమవారం కబరస్థాన్ కమిటీ సభ్యులు అబ్బుబాయ్, ఖాన్ షైక్ మాకబుల్, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌ను కలిసి కబరస్థాన్‌లో వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కబరస్థాన్ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం కార్పొరేటర్ అధికారులతో మాట్లాడుతూ.. కబరస్థాన్‌లో రెండు అప్రోచ్ సీసీ రోడ్లకు, 25 ఎలక్ట్రికల్ పోల్స్‌లైట్స్, షెడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. మధ్యలో మినీ హైమాస్క్ లైట్స్‌కు ఏర్పాటు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ వెన్నెల గౌడ్, ఏఈ వినీత్ రావు, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి,సయ్యద్ మోసీన్, జావిద్, అయాజ్ ఖాన్, ఇబ్రహీం, నజం, అజీమ్, మహమ్మద్ అల్తాఫ్, షేక్ నూర్, అమీర్ బిన్ అక్రమ్, ఉన్నారు.

ఎల్లారెడ్డిగూడలో తృప్తి టిఫిన్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో కూకట్ల రామారావు ఏర్పాటు చేసిన తృప్తి టిఫిన్‌సెంటర్ ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు పత్తి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిఫిన్‌సెంటర్ నిర్వాహకుడు రామారావును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సందీప్, జగదీష్, దశరథ్, అల్లూరయ్య, కిరణ్, విజయేందర్ పటేల్, శేఖర్, శ్రవణ్, సాయిబాబు తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారురాలు డోలి కృష్ణవేణి సంతాప సభ



నవతెలంగాణ-ఆల్వాల్

ఇటీవల మరణించిన తెలంగాణ ఉద్యమకారురాలు డోలి కృష్ణవేణి సంతాప సభను తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో బొల్లారం ఉద్యమకారుల ఫోరమ్ కార్యాలయంలో పుట్నాల కృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కృష్ణవేణి తెలంగాణ ఉద్యమానికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఒక మహిళగా ఆల్వాల్‌లో జరిగిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని కొనియాడారు. ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని, వారికి పెన్షన్, ఐడీ కార్డులు అందజేసి ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణవేణి కుటుంబానికి సహకరించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డిలకు ఉద్యమకారులు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో పుట్నాల కృష్ణ, పట్లొల్ల సురేందర్ రెడ్డి, ఆనంతుల సంతోష్, మంద శోభన్ బాబు, రాపర్తి చంద్రశేఖర్, ముత్యాలు, గోపాల్, డోలి సుధీర్, డోలి సుకుమార్, బాలనర్సింహా, జమ, విలియం, మరియు డోలి కృష్ణవేణి బంధువులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్‌లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తానన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ సాఫీగా సాగేలా చర్యలు చేపడతానని, అక్రమ పార్కింగ్, రోడ్డు నియమ నిబంధనలు పాటించకుంటే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'లక్షల డప్పులు వేల గొంతులు' పోస్టరావిష్కరణ



నవతెలంగాణ-కీసర

ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్ జరిగే లక్షల డప్పులు వేల గొంతులు మహా ప్రదర్శనను విజయవంతం చేయలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాదిగ అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలో లక్ష గొంతులు వేల డప్పుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహా ప్రదర్శనలో మాదిగలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కీసర మండలం ఇన్‌చార్జి బుడిగే జగన్ మాదిగ, రాంపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు పరమేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా భాస్కర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగరావు మాదిగ, కార్యదర్శి పొడవల్ల రవి మాదిగ, కార్యవర్గ సభ్యులుగా మహేందర్ మాదిగ, పోడవళ్ళ భిక్షపతి, ఈశ్వర్, వెంకటేష్, బాబు, తదితరులున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు

- ప్రజలందరూ చల్లగా ఉండాలి
- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్



నవతెలంగాణ - జవహర్ నగర్

ముత్యాలమ్మ తల్లి చల్లని దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్టు మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలోని ముత్యాలమ్మ దేవాలయంలో సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన ప్రథమ వారికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిధిగా హాజరై జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతున్న అమ్మవారి పూజలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ముష్ణం హరి ప్రసాదాచార్య బృందంతో ఉదయం గణపతి పూజతో ప్రారంభమై మూల మంత్ర సహిత లక్ష్మి హోమం, మహా కుంభ అభిషేకం, అలంకరణ, నైవేద్యం, హారతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ, కాలనీ వాసులు అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్తా, నాయకులు కోటేష్ గౌడ్, నిహారిక గౌడ్, బింగి సతీష్ గౌడ్, గొడుగు వేణు, కూతాడి సాయి, అనిల్ ముదిరాజ్, దయాకర్ చారి, నాయకం భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సీఐ శ్రీనివాస్‌కు సన్మానం

- ట్రినిటీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్



నవతెలంగాణ-కీసర

కీసర నూతన సీఐగా నియమితులైన శ్రీనివాస్‌ను ట్రినిటీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌కు చెందిన అమృత్ రాజ్ శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. పోలీస్ శాఖ సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో ఎంతో కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా సీఐ శ్రీనివాస్‌ను సన్మానం చేశారు. సీఐ శ్రీనివాస్ తన కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజా సేవలో తన అంకితభావాన్ని కొనసాగించాలని కోరారు. కీసర పోలీస్ స్టేషన్ ప్రాంతంలో శాంతి భద్రతలు మరింత మెరుగుడతాయని భావిస్తున్నానని తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్ నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు లద్ధిపేర్ల నర్సింగ్ గౌడ్ నేతృత్వంలో.. సోమవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు.
నవతెలంగాణ-దుండిగల్



సూరారం విశ్వకర్మ కాలనీలోని " స్ప్రింగ్ హిల్ మోంటెస్సోరి స్కూల్ " లో వసంత పంచమి సందర్భంగా సోమవారం భక్తిశ్రద్ధలతో సరస్వతి దేవి అమ్మవారి పూజను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ డి అరుణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో సూరారం లోని స్థానిక భక్తులు , చిన్నారుల తల్లిదండ్రులు , విద్యార్థులు హాజరయ్యారు. పూజల అనంతరం సమూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పంతులు జగదీష్ శర్మ చిన్నారుల చేత అక్షరాలను దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బడ్జెట్‌తో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్
- సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ... సీపీఐ(ఎం) పార్టీ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో.. ప్లే కార్డ్స్‌తో షాపూర్ నగర్ సీపీఐ(ఎం) కార్యాలయం దగ్గర సోమవా రం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం 2025-20 26 బడ్జెట్‌ని ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీ సీట్లు కట్టబెడితే.. బడ్జెట్లో తెలం గాణను పూర్తిగా విస్మరించింద న్నారు. బీజేపీ దాని మిత్ర పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఇప్పుడు ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయి ంచిందని పేర్కొన్నారు. మిగతా రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపించి, తెలంగాణలో ఉపాధి హామీ పథకాన్ని నీరుగారిచే విధంగా తక్కువ బడ్జెట్‌ని కేటాయించడం జరిగిందన్నారు. అలాగే వ్యవసారంగానికి కూడా సరైన బడ్జెట్ కేటాయించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికై నా స్పందించి పేదలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు. లేని పక్షంలో పేదలను, కార్మికు లను, రైతులను సమీకరించి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, ఈ దేవదానం, కే.శీను,మల్లారెడ్డి, వీరేషు సాధులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల కడుపు కొట్టి కార్పొరేట్ల జేబులు నింపే బడ్జెట్..

కూకట్‌పల్లి: సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో.. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ.. కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, నాయకులు భీమేశ్వరరావు, బి. శ్రీను, పి.ధర్మారావు, బి.రాములు తదితరులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2025-26 ప్రవేశపెట్టినటువంటి, కేంద్ర బడ్జెట్ కష్ట జీవుల కడు పులు కొట్టి, కార్పొరేట్లకు జేబులు నింపే విధంగా, ఈ బడ్జెట్ రూపొందించారని మండిపడ్డారు. ఢిల్లీ బీహార్ రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, ఆ రాష్ట్రాలకు మేలు చేసే విధంగా బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. మధ్య తరగతి వారికి 12 లక్షల వరకు పన్నుల కట్టే అవసరం లేదని చెబుతూనే, పేదలపై ,కార్మికులపై సామాన్యులపై నిత్యావసర సరుకుల ధరలు పెంచే విధంగా ఈ బడ్జెట్ ఉందని అన్నారు. దేశానికి ఇది తిరోగమన బడ్జెట్ అని, కావున కార్మికులు, శ్రామికులు, కష్టజీవులు, సామాజిక వర్గాలు అసంఘటిత కార్మికులు అందరూ ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోరా డాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, శివ, స్వామి, నారాయణ, వీరయ్య, వెంకటయ్య, భారతమ్మ, నీలావతి తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ కేటాయింపులో కేంద్రం ప్రభుత్వం తెలంగాణపై వివక్ష ..

దుండిగల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపి నిధుల కేటాయిం పులో అన్యాయం చేసిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమం లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొ న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం యొక్క వివక్ష స్పష్టంగా కనిపిస్తుం దని ఆయన విమర్శించారు. తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించక నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యాక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మెన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి , జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ళ లక్ష్మీ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సదానందం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ యువజన నాయకులు బొంగునూరి కిశోర్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, కార్యకర్తలు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాల ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపిహెచ్‌బీ డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను, 7వ ఫేస్‌లోని హిందూ, ముస్లిం, క్రిస్టి యన్ స్మశాన వాటికలను ఎమ్మెల్యేతో కలిసి స్థానిక కార్పొ రేటర్ మందడి శ్రీనివాస్ రావు పాల్గొని పరిశీలించారు. ముందుగా ఎన్ఆర్ఎస్ఎ కాలనీలో పార్కును పరిశీలించి వాలీబాల్ కోర్టుగా అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ నగర్, ఎన్ఆర్ఎస్ఎ కాలనీ లింక్ రోడ్డును అభివృద్ధి పరచాలని ఆదేశాలు జారీ చేశారు. డైమాండ్ ఎస్టేట్స్‌లోని ఓపెన్ ప్లేస్ ఫ్లోరింగ్ పూర్తి చేసి దానీ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టి బోర్వెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ముస్లిం స్మశా న వాటికలో ముఖ ద్వార నిర్మాణం చేసి మౌలిక సదుపా యాలుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. హిందూ, క్రిస్టియన్ గ్రేవియర్డ్‌లలో కాంపౌండ్ వాల్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలకి ఇబ్బంది లేకుండా చూసుకుంటానని.. ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు సాయి బాబు చౌదరి, వెంకట రెడ్డి, పవన్, రాజేష్ రాయ్, పాతూరి గోపి, ప్రతాప్, పీఎల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ ప్రయోజనానికి పరిశోధనలు చేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమాజ ప్రయోజనానికి తోడ్పడే పరిశోధనలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ హెచ్‌లో రిసె ర్చ్ మెథడాలజీస్ అనే అంశంపై ఒక వారము ఆడిట్ కోర్సు ప్రారంభోత్సవం యూజీసీ హెచ్ఆర్డీసీ ఆడిటోరి యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. బాల కిష్టా రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంక టేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యుగంలో మల్టీ-డిసిప్లినరీ రీసెర్చ్ అవసరం ఉందని పేర్కొన్నారు. ఇన్నోవేటివ్ ఉత్పత్తులు రాబట్ట డానికి ఇలాంటి పరిశోధనలు ఎంతో అవసరమని చెప్పారు. ఏవియేషన్ వంటి రంగాల్లో పెరుగుతున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిశోధన చేస్తున్న విద్యార్థులు సమయ నియంత్రణ, నిశ్చయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రొఫెసర్ తులసీరాం దాస్ మాట్లాడుతూ మంచి పరిశోధకుడు కావడానికి అవసరమైన గుణాలను అలవరచుకోవాలని తెలిపారు. .ఈ ఒక వారపు వర్క్ షాప్ 2024 ఫిబ్రవరి 8వ తేదీ వరకు కొనసాగనుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే సంస్థల పరిశోధ కులు, పరిశ్రమ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, జేఎన్‌టీయూహెచ్ అధ్యాపకులు పాఠాలు బోధించి, అవసరమైన మార్గదర్శకత్వం అందించను న్నారు. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూహెచ్ ఆర్ అండ్ డీ సెల్ విజయవంతంగా నిర్వహించారు.

కుత్బుల్లాపూర్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తాం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

క్రీడా మైదానాలను ఏర్పాటుచేసి కుత్బుల్లాపూర్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. 132 - జీడిమెట్ల డివిజన్ లోని సెయింట్ మోసెస్ హై స్కూల్ వేదికగా కుత్బుల్లా పూర్ మండలం స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం నిర్వహిస్తున్న లిటరరీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ - 2025 ప్రారంభోత్సవ కార్యక్రమా నికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, సీనియర్ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మారెడ్డి హాజరై స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థు లు చదువుతో పాటు క్రీడల్లో రాణించినట్లయితే మానసిక పరిపక్వతతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. అనంతరం స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభ సూచికగా బెలూన్లను గాలిలోకి వదలడంతో పాటు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమిని కుమారి, నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, ఎల్లా గౌడ్, అసిస్టెంట్ ఎంఈవో రమేష్, స్టేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్. రెడ్డి, వైస్‌చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సలో ప్రొఫెషనలిజం ముఖ్యం

- డాక్టర్ నాగేంద్ర పర్వతనేని, సీనియర్ కన్సల్టెంట్, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి కిమ్స్‌ఆస్పత్రి, సికింద్రాబాద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్యాన్సర్ చికిత్సలో ప్రొఫెషనలిజం ముఖ్యం అని సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగేంద్ర పర్వతనేని అన్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్యాన్సర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి అనీ, ఇది రోగి శారీరక ఆరోగ్యం, భావోద్వేగ, సామాజిక, మానసిక శ్రేయ స్సుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ కాగానే జీవితం అనిశ్చితిగా ఉంటుం దనీ, లేదా మరణిస్తామన్న భయాన్ని రేకెత్తిస్తుందనీ, ఇది రోగి, వారి కుటుంబ సభ్యుల్లో విపరీతమైన ఆందోళనకు దారి తీస్తుందనీ, దీనివల్ల షాక్, అపనమ్మకం, విచారం, కోపం లేదా తమ భవిష్యత్‌పై నియంత్రణ లేకపోవడం వల్ల నిస్సహాయత రూపంలో బయటపడుతుందని తెలిపారు. క్యాన్సర్ చికిత్సలో వైద్యులకు కరుణ, సహానుభూతి ఉండాలన్నారు. స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులతో సహ చాలా మంది వైద్య సిబ్బందికి క్యాన్సర్ చికిత్స చేసే జ్ఞానం, నైపుణ్యం, అనుభవం ఉంటాయనీ, చాలామంది సాక్ష్యాల ఆధారిత చికిత్సలు చేస్తారనీ, ఇది చాలా ప్రభావవంతమైనదని తెలిపారు. రోగులు తమ అపాయి ంట్‌మెంట్ కంటే ముందు తమ పరిస్థితి, అందుబాటులో ఉన్న చికిత్సా పద్ధతులను పరిశోధించాలనీ, ఆ తర్వాత చికిత్స ప్రణాళిక లేదా ఖర్చు గురించి అనుమానం వస్తే.. వారు సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని తెలిపారు. రోగి అవసరాలు, క్లినికల్ మార్గదర్శకాలు, వారి నైతిక సూత్రాలను కలిగి ఉన్న వైద్యుడి నిర్ణయ ప్రక్రియను చాలా అంశాలు ప్రభావితం చేస్తాయని చెప్పారు. ప్రొఫెషనలిజానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, చాలా మంది క్యాన్సర్ రోగులు, వాళ్ల కుటుంబాల జీవితాలను వైద్యులు గణనీయంగా మార్చగలరు అని తెలిపారు. అత్యంత సంక్లిష్టమైన క్యాన్సర్ వల్ల ఎదురయ్యే సవాళ్లను గౌరవం, ఆశతో నావిగేట్ చేయడంలో రోగులకు సహాయపడటానికి హాస్పిటల్స్ సుపరిపాలన చాలా ముఖ్యం అని తెలిపారు.

యువతపైనే దేశ భవిత



- బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్. ఎస్.మల్లారెడ్డి
- మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి యువతపైనే రేపటి దేశ భవిత ఆధారపడి ఉందని ఆ దిశగా నిరుద్యోగ యువత సమయాన్ని వృధా చేయకుండా ఉపాధి అవకాశాలు ఎంచుకోవాలని బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో సంఘ సేవకులు ఆదిత్య కోడి, ఉదయ్ గంజిల అధ్వర్యంలో నిర్వహించిన "మెగా జాబ్ మేళా"కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఆయన, చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మొహమ్మద్ రఫీ,జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తార చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్‌లు కలిసి ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 350 పైగా యువత పాల్గొన్నారు. 100 కి పైగా వివిధ కంపెనీలలో సెలెక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యారన్నారు.నిరుద్యోగ యువత కోసం ఇటువంటి గొప్ప జాబ్ మేళాను ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఆదిత్య కోడి, ఉదయ్ గంజిలను పాల్గొన్న నేతలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భరత్ సింహ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగా లక్ష్మారెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు సత్యం, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ చారి, వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మినాథ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్ ముదిరాజ్, రాజా సదానందం, భాను చందర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం..



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మగూడలోని నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎఐసీటీఈ, అటల్ వారి సహకా రంతో డీప్ లెర్నింగ్ ఫర్ సోషల్ ఇంపాక్ట్: అటామిక్ ఆబ్జెక్ట్ డిటెక్షన్ ఇన్ రియల్ వరల్డ్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులపాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ను జూమ్ వేదిక ద్వారా ఆన్లైన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టీయూహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగపు సీనియర్ ప్రొఫెసర్ డా.ఎస్ విశ్వనాథ రాజు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల అధ్యాపకులు వారి నైపుణ్యాలను మరింత మెరుగు పర్చుకునే అవకా శం ఉందని తెలిపారు. ఇలాంటి ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించడానికి తమ కళాశాల ఒక వేదిక అవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమని కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. ఎ మోహన్ మాట్లాడుతూ ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెం ట్ ప్రోగ్రాం వల్ల అధ్యాపకులు భవిష్యత్తులో రానున్న మార్పులకు అనుగుణంగా బోధన చేస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ ఈ ఎఫ్డీపిలో భాగంగా డీప్ లెర్నింగ్ ద్వారా ఇమేజ్ స్పీచ్ రికగ్నిషన్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ను గుర్తించవచ్చని డా.విశ్వనాథ రాజు వివరించారు. ఈ ఎఫ్డీపికి దేశవ్యాప్తం గా 220 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 480 మంది అధ్యాపకులు నమోదు చేసుకోగా.. ఎఐసిటిఈ, అటల్ వారి నియమాలను అనుసరించి 300 మంది అధ్యాపకులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి కళాశా ల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి డైరెక్టర్ డా.ఎ మోహన్, ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, వైస్ ప్రిన్సిపాల్ డా. కె పురుషోత్తం ప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ డా. డి మురళి, వివిధ అధ్యాపకులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్, మహదేవపురంలో గల శ్రీమాత యోగాన్నపూర్ణేశ్వరి దేవాలయం 25వ వార్షిక మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరితోపాటు పలువురు ప్రముఖులు వేద పండితుల మధ్య యోగాన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు జగన్ గురూజి, దేవాలయ ట్రస్ట్ సభ్యులు,స్థానిక నాయకులు,భక్తులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు లోని సెవెన్ హిల్స్ కాలనీ లో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల వింశ(20వ) వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సౌజన్యంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి రజత(వెండి) కవచం ను దాతల సమక్షంలో పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, దేవాలయం ఈఓ సత్యనారాయణ, భక్తులతో కలిసి స్వామి వారి బహుకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి దాతల సహకారంతో రజత కవచం ను అందచేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రజత (వెండి) కవచం అందచేసిన దాతలు: ప్రసాద్ - పద్మిని, బాలు- మంజుల, సాంబశివరావు- ఉషారాణి, ఉమ శంకర్ -సుజాత, నాయకులు కెఆర్కె రాజు, రాగ ప్రసాద్, పోతుల రాజేందర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు పోరాడతాం..

- కార్పొరేటర్ రోజాదేవి రంగారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పి, ప్రజలను వేధించే పాలన చేస్తుందని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే ప్రజల తరపున అమలు చేసే వరకు పోరాడుతామని కార్పొరేటర్ అన్నా రు. సోమవారం వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద డివిజన్‌లో, ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా.. వార్డు ఆఫీసులో ప్రజా పాలనలో, అప్లికేషన్ చేసుకున్న సర్వే లిస్టులో రానివారికి, కొత్త దరఖాస్తుల స్వీకరణ పనులను పరిశీలించారు. గతంలో ప్రజాపాలన 6 గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించి అందులో, 40 శాతం మాత్రమే ఎంట్రీలు చేశారని, ఎంట్రీలు అయిన వాటిలో కూడా కేవలం ఒక్క పథకం మాత్రమే ఉందన్నారు. కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ కేవలం ఇందిరమ్మ ఇండ్లకు మాత్రమే స్వీకరించడం కాకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏవైతే ఆరు గ్యారంటీలు అని చెప్తున్నారో వాటి కి కూడా స్వీకరించాలని తెలిపారు. ఇప్పటివరకు చేసిన ఇందిరమ్మ ఇండ్లు సర్వే కేవలం వెరిఫికేషన్ మాత్రమే, కాబట్టి వారికి ఇండ్లు ఎప్పటి వరకు ఇస్తారు, ఎక్కడ ఇస్తారు అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలిపారు.

జేవీవీ కృషి అభినందనీయం



- మేడ్చల్ జోన్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి
- జన విజ్ఞాన వేదిక సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థుల్లో శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందిస్తున్న జేవీవీ కృషి అభినందనీయం అని మేడ్చల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సర సైన్స్ క్యాలెండర్-2025ను పేట్ బషీర్‌బాద్‌లోని డీసీపీ కార్యాలయంలో డిప్యూటీ కోటిరెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్క రించి మాట్లాడారు. ప్రముఖ భారతీయ సైంటిస్టుల ఆవిష్కరణలతో నూతన సంవత్సర సైన్స్ కాలెండర్‌ను తీసుకురావడం హర్షించదగ్గ విషయమనీ, ఈ విధంగా విద్యార్థుల్లో శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులకు అభినందనలు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీని వాస్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గోళ్ళమూడి రమేష్ బాబు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రముఖ సైన్స్ ప్రచార సంస్థగా భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలతో కూడిన ఈ సైన్స్ క్యాలెండర్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలకు ఉచితంగా అందజేస్తామన్నా రు. విద్యార్థులందరూ శాస్త్రవేత్తల ఆవిష్కరణలను స్ఫూర్తి గా తీసుకొని, వారు కూడా భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదిగి, దేశ అభివద్ధిలో భాగస్వాములు అవుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి జెన్నీ, పాల్గొన్నారు.

5

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం

మంగళవారం ఫిబ్రవరి 04, 2025 www.navatelangana.com

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్‌లో రాచకొండకు 3 బంగారు పతకాలు



నవతెలంగాణ-హాయత్ నగర్

రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 3వ స్పోర్ట్స్ మీట్, గేమ్స్ కార్యక్రమం గత నెల 28 నుంచి ఫిబ్రవరి1వరకు కరీంనగర్‌లో నిర్వహించారు. రాచకొండ కమిషనరేట్ నుంచి పాల్గొన్న యామన్ కుమార్ అర్చరీలో కౌచ్ గా, క్రీడాకారుడిగా కాంపౌండ్ విభాగంలో 50మీటర్ల దూరంగా 3బంగారు పతకాలు సాధించినట్టు రాచకొండ కమిషనరేట్ సోమవారం వెల్లడించింది.

మామ కిచెన్‌ను ప్రారంభించిన దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

రామకృష్ణ పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ యువజన కాంగ్రెస్ నాయకులు సత్తి నూతనంగా ఏర్పాటు చేసిన మామ కిచెన్‌ను కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పందుల వెంకటేష్ గౌడ్,కళ్యాణ్ యాదవ్, మస్న రవి, నబీ, యూసఫ్ ఖాద్రి, పెద్దవూర సైదులు, ఫజిల్ ఖాద్రి,శ్రీధర్, అశోక్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి





- సీపీఐ(ఎం) హైదరాబాద్ సబ్ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జి . విట్టల్

నవతెలంగాణ-చంపాపేట్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని సీపీఐ(ఎం) హైదరాబాద్ సబ్ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జి . విట్టల్, పి. నాగేశ్వరరావు, ఎల్ కోటయ్య ఎం. మీన, ఎల్.కోటయ్య విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో ఐ ఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ చౌరస్తా వద్ద కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. ఇది వికసిత్ భారత్ బడ్జెట్ కాదని కేవలం కార్పొరేట్ బడ్జెట్ మాత్రమేనని విమర్శించారు. నిధులన్నీ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే కేటాయించి బీజేపీయేతర రాష్ట్రాలకు అరకొర బడ్జెట్ కేటాయించి చేతులు దులిపేసారని అన్నారు. కనీస వేతనాలు రూ.26,000కు పెంచాలని, కార్మిక సంస్కరణలను, విద్యుత్ సంస్కరణలను ఆపాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్‌పై పన్నులు రద్దు చేయాలని, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగో లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అను ఇన్ ధన సంస్థలను ప్రయివేటీకరించే యోచనను మానుకోవాలన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా కార్మిక, కర్షక, సామాజిక, విద్యార్థి, యువజన, మహిళ... ప్రజాసంఘాలన్నింటి ఏకం చేసి ఉద్యమాలు చేసి తమ డిమాండ్లను సాధించుకునేం తవరకు సీపీఐ(ఎం) మందంటుందని తెలిపారు.పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలు, అబ్దుల్ సత్తార్, ఎం.లక్ష్మమ్మ, ఎస్.కిషన్, రామ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయండి

- జలమండలి ఎండీకి కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ వినతి



నవతెలంగాణ -నాగోల్

రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాగోల్ డివిజన్‌లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అదేవిధంగా డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి తగిన నిధులను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ చింతల్ అరుణ సురేంద్రనాథ్ యాదవ్ ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ డివిజన్ పరిధిలోని డ్రయినేజీ సమస్యలను వారి దష్టికి తెచ్చారు . డివిజన్‌లోని రామాంజనేయులు కాలనీ, నరసింహస్వామి కాలనీ ఫేస్ -2,సాయి సప్తగిరి కాలనీ, శ్రీనివాస కాలనీ, మరిన్ని కాలనీలకు డ్రయినేజీ లైన్ మంజూరు చేయాలని కోరారు. 25 ఏండ్ల కిందట వేసిన డ్రయినేజీ లైన్‌లు పాడైపోయి నిరంతరం రోడ్లమీదకి డ్రయినేజీ నీళ్ల పారుతున్నాయని, డివిజన్ ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నా రన్నారు, వెంటనే వాటిని గుర్తించి నూతన డ్రయినేజీ లైన్ లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. డివిజన్ లో కొన్ని కాలనీలలో తాగునీటి పైపులైన్‌లు మంజూరు చేయాలని కోరారు. కాలనీలలో డ్రయినేజీ లైన్ పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా ఇంకా రోడ్ల మరమ్మతులు చేయడం లేదని, రోడ్లన్నీ గుంతలుగా ఏర్పడి ప్రజలు నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పనులు చేయించేలా చూడాలని ఎండీని కోరారు. అందుకు ఎండీ సానుకూలంగా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చినట్టు తెలిపారు.

రైతు బజార్లలో దళారీ వ్యవస్థకు చెక్ పెడతాం



- గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

రైతు బజార్లలో దళారీ వ్యవస్థకు చెక్ పెడతామని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధు సూదన్ రెడ్డి అన్నారు. కొత్తపేట రైతుబజార్‌ను సోమవారం మార్కెట్ కమిటీ చైర్మెన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్లలో దళారీ వ్యవస్థకు ప్రమేయం లేదన్నారు. రైతులు పండించిన పంటను నేరుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతు బజార్లలో వినియోగదారులకు అందిస్తామన్నారు. అధికారులు సూచించిన ధరలకు వినియోగదారులకు రైతులు అమ్మాలి అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను ఇవ్వాలని తెలిపారు.పాలకవర్గం సభ్యులు, అధికారులతో రైతుబజారును పూర్తిగా తిరిగి ప్రతి స్టాల్ ను పరిశీలించి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వచ్చే వినియోగదారుల అభిప్రాయాలు కూడా తెలుసు కున్నారు. కొత్తపేట రైతు బజార్ ఎదురుగా రైతులకు నష్టం కలిగేలా సాయంత్రం వేళలో కొంతమంది దళారులు అమ్ముతున్న విషయం రైతులు తమ దృష్టికి తేవడం జరిగిందని అలాంటి దళారి వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. రైతు బజార్లలో అధికారులు రైతులతో వినియోగదారులతో సమన్వయంతో ఉండాలని, సమస్యలు లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని తెలియ జేశారు. వినియోగ దారులకు అమ్ముకునే రైతులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత మార్కెట్ అధికారులదేనన్నారు. రైతు బజార్లలో ధరల పట్టిక ప్రకారం కూరగాయలు అమ్మాలని లేనిచో చర్యలు తప్పవన్నారు . రైతులకు ఏ సమస్య ఉన్నా వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సీహెచ్ భాస్కరాచారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్ , రఘు పతి రెడ్డి, దోమలపల్లి అంజయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ శ్రీనివాస్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ స్రవంతి తోపాటు సూపర్ వైజర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ శంకర్



నవతెలంగాణ-హాయత్ నగర్

కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపిందనరి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ శంకర్ విమర్శించారు. సోమవారం హాయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కలశాల ముందు నిరసన తెలియ జేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ఎస్ వ్యూహాలు విద్యలో అమలుకు బీజేపీ చర్యలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వాల హక్కులను లాక్కునే చర్యలు బడ్జెట్‌లో పెట్టిందని తెలిపారు. విద్యను మరింత కార్పొరేట్, ప్రయివేటీకరణకు దగ్గర చేస్తున్న విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. గతం కంటే విద్యారంగానికి బడ్జెట్‌లో నామమాత్రంగా 0.2 శాతం మాత్రమే పెరిగిందని, 12467.39 కోట్ల నుంచి 12500 మాత్రమే విద్యారంగానికి నిధులు పెరిగాయని గుర్తు చేశారు. ఈ నిధులు ఏమాత్రం సరిపోవని,ఇప్పటికే పాఠశాల విద్యకు దేశంలో నిధుల కొరత తీవ్రగా ఉన్న నేపథ్యంలో పాఠశాల విద్యకు రూ.73008 కోట్ల నుంచి రూ.78572 కోట్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య కోసం నామమా త్రంగానే బడ్జెట్ కనిపిస్తున్నదని.. రూ 47619.77 కోట్ల నుంచి రూ 50077.95 కోట్లకు కేవలం 5 శాతం మాత్రమే పెరుగుదల చూడవచ్చన్నారు. విద్యారం గానికి నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు వేణు, ప్రణయ్, మహేష్, ఆశ్రిత,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చిన్న మొత్తం పొదుపు సంఘాలు

రేపటి భవిష్యత్తుకు పునాదులు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- జై భీమ్ పొదుపు సంఘం భవనం ప్రారంభం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి చిన్న మొత్తాల పొదుపు సంఘాలే రేపటి భవిష్యత్తుకు పునాదులని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో జై భీమ్ పొదుపు సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చి చింత లేకుండా చేశారని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు.కుల సంఘాల ద్వారా చిన్న మొత్తాలు పొదుపు చేసుకుంటే రేపటి భవిష్యత్తులో ప్రజలకు పునాదిలా నిలుస్తుందని సూచించారు. శ్రీరామ కాలనీ అంటే ఒక మినీ ఇండియా అన్నారు. శ్రీరామ కాలనీలో అనేక కులాలు ఉండడం, వాటికి అనుగుణంగా పొదుపు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం హర్షనీయమన్నారు. పొదుపు చేసుకునే ఆలోచన రావడం, సంఘాల ద్వారా పొదుపు చేసుకోవడం రేపటి భవిష్యత్తుకి పునాదిలా,పొదుపు సంఘాలు ప్రజలకు ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో జై భీమ్ పొదుపు సంఘం ఏర్పాటు చేసుకోవడానికి సంఘ సభ్యులు చేసిన కృషి నేడు భవనం ప్రారంభించడం, అందులో ప్రస్తుతం 350 మంది సభ్యులు చేరి రూ.45 లక్షల వరకు పొదుపు చేసుకోవడం హర్షనీయమన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జల్ పల్లి, శ్రీరామ కాలనీలో అన్ని కులాలకు అనుగుణంగా పొదుపు సంఘాల భవనాలను నిర్మించేందుకు స్థలాలు కేటాయించి, నిధులు మంజూరు చేశామన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంఘాలకు మంజూరు చేసిన నిధులకు అడ్డుపడిందన్నారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆర్థికంగా ప్రజలు మరల ఐదేండ్లు వెనకకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. అయినా అధైర్య పడొద్దని తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, కుల సంఘాల భవనాలు కచ్చితంగా నిర్మించిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి గతంలో కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.270 కోట్ల నిధులను, రద్దు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. సంవత్సర కాలంలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ ఇతర దేశాలలో తిరగడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ బి. వెంకట్రామ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, నాయకులు నవాపు పేట్ ఆంజనేయులు,నాగభూషణ్,ఉష్కమూరి నిరంజన్, గుండు నర్సింగ్, జై భీమ్ పొదుపు సంఘం అధ్యక్షుడు రావులగళ్ళ యాదగిరి, కార్యదర్శి బాలరాజ్, సంఘం పాలకవర్గ సభ్యులు యంజాల అర్జున్, చెన్నం రాజేష్, డి శ్రీనివాస్, జి సంధ్య, ఎస్ భద్రమ్మ, జై భీమ్ పొదుపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యతోనే మంచి గుర్తింపు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యతోనే ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు వస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.సోమవారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో శ్రీరాం కాలనీలో ఉన్న శ్రీ హర్ష ఇంటర్నేషనల్ పాఠశాలలో చేపట్టిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్యతోనే సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటారని తెలిపారు. విద్యార్థులు కృషి పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్,కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కష్టారెడ్డి,మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్,మాజీ ఎంపీటీసీ జనార్దన్, పాఠశాల చైర్మెన్ ఉష్కమూరి నిరంజన్,కరస్పాండెంట్ వి.శిరీష, ప్రిన్సిపాల్ వి.స్వప్న,అకడమిక్ డీన్ కష్టారెడ్డి,ఉపాధ్యాయులు విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

- భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్

నవతెలంగాణ-చంపాపేట్

రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 15న సంత్ సేవలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడమే కాకుండా సెలవు దినంగా ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు. భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ డిమాండ్ చేశారు. సోమవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వినయ్ నగర్‌లో తన కార్యాలయంలో జరిగిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుగాలి ప్రజల అత్యంత ఆరాధ్య దైవం సంత్ సేవ లాల్ మహారాజ్ అని ఆయన జయంతిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచన చేసి ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలన్నారు. సుగాలి ప్రజల జీవన అభివృద్ధి కోసం కషి చేశారని, వైద్యం లేని రోజుల్లో నాటు వైద్యం ద్వారా సుగాలి ప్రజలను రక్షించిన ఘనత సేవాలాల్ మహారాజ్‌కు దక్కుతుందనికొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



టీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-హాయత్ నగర్

టీ నగర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎంపీ శ్రీనివాస్ రావు,ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ భాస్కర్, కోశాధికారిగా గోలి యాదయ్య, గౌరవ అధ్యక్షులుగా వి.సతీష్,ఉపాధ్యక్షులుగా ఎం.రమేష్, మల్లారెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా జి.దాసు గౌడ్,జాయింట్ సెక్రెటరీగా భాస్కర్ రెడ్డి, సతీష్ గౌడ్,ఎస్.శ్రీనివాస్,కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి,స్టాలిన్ రెడ్డి,రంగారావు,నరేష్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,యాదిరెడ్డి,రమేష్,రవి కుమార్,ప్రతాప్ రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కాలనీ అభివద్ధి కోసం కషి చేస్తామని చెప్పారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివద్ధి కోసం ముందు ఉంటామని కాలనీ వాసులకు సూచించారు.

వసంత పంచమి సందర్భంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో దేవాలయ పాలక మండలి మాజీ చైర్మెన్ నల్ల రఘుమా రెడ్డి సుమిత దంపతులు సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి పెన్నులు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ ధర్మకర్త మధు సాగర్, బండారు శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు



నవతెలంగాణ-చంపాపేట్

రైతాంగాన్ని మోసగించిన కేంద్రం



- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-చంపాపేట్

వ్యవసాయ రంగాన్ని మొదట ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసగించిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ప్రజాసంఘాల ఐక్యత వేదిక మహాధర్నను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ సౌత్ సిఐటియు కమిటీ ఓటీ సమావేశం సంతోష్ నగర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వారు పాల్గొని ప్రసంగించారు.

సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన , భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయమన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలు రాష్ట్రం ఏర్పడ్డ పది సంవత్సరాలు తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రైతు రుణమాఫీ పథకం, ఉపాధి హామీ పథకాలు నిధులు పెంపులను విస్మరించింది కేంద్రం అన్నారు. విద్యుత్, వ్యవసాయ పారిశ్రామిక రంగాలకు తీవ్ర హానీ కలుగనున్నదని చెప్పారు.బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐలు తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రవేశ పెట్టడం దారుణమన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్ ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా ఉందన్నారు. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రయివేటీకరించి ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టేందుకు బరితెగించిందన్నారు. ఇది కార్మిక వ్యతిరేక బడ్జెట్ దీన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. మార్చి నెలలో జరిగే రాష్ట్ర బడ్జెట్లో కార్మిక వర్గానికి పేద ప్రజలకు మహిళలకు యువకులకు అభివృద్ధి చేకూర్చే విధంగా ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికులు పేదలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం మీనా, ఎం శ్రవణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కిషన్, టి సత్తయ్య, పి మురళి, జిల్లా ఉపాధ్యక్షులు కే జంగయ్య, ఎల్ కోటయ్య ,వీ రామ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

కుంభాభిషేక మహోత్సవంలో సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-దిల్ సుఖ్ నగర్

ఆర్కే పురం డివిజన్ పరిధిలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పుష్కరకాలం పూర్తి అయిన సందర్భంగా ఆలయ నిర్వాహకులు కుంభాభిషేకం నిర్వహించారు. ఈ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ అయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నేతలు శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల శేఖర్, కొంద్రు శ్రీనివాస్, సాజిద్, శ్యాం గుప్త, నవీన్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి, స్వప్న, అనురాధ , చైర్మన్ వరప్రసాద్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ సీపీఆర్ నేర్చుకోవాలి



- లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ
- కోడ్ బ్లూ లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ -ఎల్బీనగర్

మనలో 90 శాతం మందికి హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం సీపీఆర్(కార్డియో పల్మోనరీ రిససిటేషన్) ఎలా చేయాలో తెలియదని లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. అందరూ నేర్చుకుంటే ప్రతి ఇంట్లో ఒక సీపీఆర్ కార్యకర్త ను తయారు చేయవచ్చన్నారు. సోమవారం కోడ్ బ్లూ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు చేసే అత్యవసర ప్రాథమిక చికిత్సను సీపీఆర్ అంటారని తెలిపారు. హార్ట్ ఎటాక్ వచ్చి పేషెంట్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేనప్పుడు సీపీఆర్ చేయడం ప్రారంభించాలని సూచించారు.

సీపీఆర్ ప్రొసీజర్

"స్టెప్ 1: ఫ్లాట్ సర్ఫేస్‌పై (బల్లపరుపుగా ఉన్న ప్లేస్‌ల)పడుకోబెట్టాలి. రెస్పాన్స్ అవుతున్నప్పుడు మీరు ఏం చేయాల్సిన అవసరం లేదు. రెస్పాన్స్ లేనప్పుడు పల్స్ చూడాలి. మేజర్ హార్ట్ అటాక్ అయితే పల్స్ దొరకదు. మెడ వద్ద పల్స్ చూడాలి. ఒకవేళ అక్కడ కూడా పల్స్ దొరకలేదంటే హార్ట్ ఆగిపోయినట్టు గుర్తించాలి

స్టెప్ 2: ఆగిపోయిన హార్ట్‌ను రన్ చేసేందుకు సీపీఆర్ చేయాలి. ఎడమ చేయి వేళ్ల మధ్య కుడి చేయి వేళ్ళు జొప్పించి లేదా కుడిచేయి వేళ్లల్లో ఎడమ చేయి జొప్పించి పేషెంట్ ఛాతి (గుండె పై కాదు) మధ్య భాగంలో నొక్కాలి. ప్రెస్ చేస్తూ ఉండాలి. నొక్కేటప్పుడు మన చేతులు, మోచేతులు బెండ్ కాకూడదు. చేతులు స్టిఫ్‌గా ఉంచి నొక్కాలి. ఛాతీ కనీసం 5 సెంటీమీటర్లు లోతుకు వెళ్లేలా నొక్కాలి. నిమిషానికి వందసార్లు, అంతకంటే ఎక్కువగా చేయాలి. కౌంట్ చేస్తూ, నిమిషానికి 100 నుంచి 120 సార్లు ప్రెస్ చేయాలి.

ఒక నిమిషం చేశాక పల్స్ చెక్ చేయండి. పల్స్ దొరకకపోతే మళ్లీ కొనసాగించాలి. ఇలా ఒక్కోసారి 20 నిమిషాలు చేస్తూనే ఉండాలి. కంటిన్యూయస్‌గా చేస్తున్నప్పుడు గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఆలస్యం చేస్తే లాభం ఉండదు. ఇవన్నీ చేస్తూనే 108కి గానీ, ఆంబులెన్స్‌కు గానీ ఫోన్ చేయాలి" అని ఆయన తెలిపారు. సీపీఆర్ ప్రాసెస్ అందరూ నేర్చుకోవాలన్నారు. ఈ ప్రక్రియ సరిగ్గా చేస్తే అనేక ప్రాణాలు కాపాడవచ్చు అనే గొప్ప లక్ష్యంతో ఈ రోజు నుంచి కోడ్ బ్లూ అనే పేరుతో సీపీఆర్ మీద అవగాహన కార్యర్యమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు యశశ్విని జొన్నలగడ్డ 'దోసపాటి రాము తెలిపారు . డాక్టర్ జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా లోగోను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక కార్యకర్తలు యశశ్విని జొన్నలగడ్డ, దోసపాటి రాము, శివరామ కృష్ణ పాల్గొన్నారు .

ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



నవతెలంగాణ-హాయత్ నగర్

డివిజన్‌ను ఆదర్శ మన్సూరాబాద్‌గా తీర్చిదిద్దుతామని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్ నగర్ ప్రాంతంలోని బొమ్మల గుడి రోడ్డు నుంచి కుంట్లూర్ రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గం ఎన్నో సంవత్సరాల నుంచి మట్టి రోడ్డు మార్గంగా ఉన్న సమస్యను ఇచ్చిన మాట ప్రకారంగా వివిధ కాలనీలకు దుర్గా నగర్,విష్ణు నగర్ కాలనీ,శివం హిల్స్ కాలనీ వద్ద నుంచి,ప్రగతి నగర్ కాలనీ,ప్రియదర్శిని కాలనీ వరకు పూర్తిగా రోడ్డును వేసేందుకు వ్యయం రూ:- 23.00 లక్షలతో రోడ్డు పనులను చుట్టుపక్కల ఉన్న వివిధ కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ఏడాది జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను మార్నింగ్ వాక్ లో భాగంగా సమస్యల పరిష్కారానికి డివిజన్లో పర్యటించాలని విజ్ఞప్తి మేరకు స్వయంగా ఇక్కడికి తీసుకువచ్చినట్టు తెలిపారు. రోజు ఉదయం సాయంత్రం స్కూల్ బస్సులు,వివిధ కాలనీవాసులు ప్రయాణించే ప్రధానమైన రోడ్డు అని వివరించి, నూతన రోడ్డును నిర్మించాలని నిధులు మంజూరు చేయించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గా నగర్,శివం హిల్స్, ప్రగతి నగర్, ఆకాష్ నగర్, పవనగిరి కాలనీ,ప్రియదర్శిని కాలనీ,విష్ణు నగర్, రాజరాజేశ్వరి కాలనీ,విజయనగర్ కాలనీ,వివిధ కాలనీ సంక్షేమ సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కోటాజీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కోటాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలో విద్యార్థుల ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉపకార వేతనాల కోసం గత సంవత్సరం 23,941 దరఖాస్తులు రాగా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 17854 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఆ దరఖాస్తులకు మార్చి 31వ తేదీ వరకు గడువు ఉండటంవలన 2024- 2025 విద్య సంవత్సరానికి సంబంధించి కళాశాల విద్యార్థులు, యాజమాన్యాలు హెచ్‌టీటీపీఎస్:// తెలంగాణఈపాస్.సీజీజీ.గొ.ఇన్ వెబ్ సైట్ లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

ఆపద మిత్ర వాలంటీర్లకు అవగాహన తరగతులు

- జిల్లా యువజన, క్రీడా అధికారి సుధాకర్ రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆపద మిత్ర వాలంటీర్ శిక్షణ కార్యక్రమాన్ని సికింద్రాబాద్ బోట్స్ క్లబ్‌లోని జిల్లా యువజన సర్వీసుల కార్యాలయ ప్రాంగణంలో ఆ శాఖ సంచాలకులు ఎస్.సుధాకర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, కె. శ్యాంసుందర్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ హైడ్రా ఆధ్వర్యంలో వాలంటీర్లకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 12 రోజులు ఇవ్వనున్న ఈ శిక్షణకు జిల్లాకు చెందిన ఆసక్తి గల యువతి యువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విపత్కర పరిస్థితులు, వైపరీత్యాలలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని కోరారు.

ఆకునూరి మురళికి టీజీవో జిల్లా డైరీ అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా నూతన డైరీ-2025ని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళికి సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ ఖాదర్ కలిసి అందజేశారు.

మేయర్‌కు తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-బంజారా హిల్స్

జీహెచ్‌ఎంసీ మేయర్‌గద్వాల విజయలక్ష్మికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఖైరతాబాద్ నియోజక వర్గంలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18,17 ల్లో సుందరీకరణ పనుల్లో భాగంగా మేయర్ పాదయాత్ర చేస్తున్న సందర్భంగా పంజాగుట్ట నాగార్జున సర్కిల్ వద్ద స్ట్రీట్ లైట్ పోల్ తట్టుకొని కింద పడ్డారు. వెంటనే సహచరులైన డిప్యూటీ మేయర్ మోత శ్రీలత రెడ్డి, విజయ రెడ్డిలు ఆమెను పైకి లేపారు.



మహా కుంభమేళాలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటిలో ఆయన మునిగి స్నానమాచరించారు. మహత్తరమైన సందర్భాన్ని ప్రత్యక్షంగా అనుభవించడం మన జీవితంలో కలిగే అపూర్వమైన భాగ్యంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.


నవతెలంగాణ -నాగోల్



డీఈఓకు వినతి

నవతెలంగాణ -బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలను త్వరగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఈఓకు వినతి పత్రం అందజేసినట్టు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం బాలాపూర్ మండల కన్వీనర్ మారబోయిన నరేందర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బడంగ్ పేట్ లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 564 మంది విద్యార్థులు ఉన్నారని, అందులో బాలురు: 258, బాలికలు: 306 మంది విద్యాభ్యాసం పొందుతున్నారని తెలిపారు.ఇక్కడ విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.అందుకోసం గత సంవత్సరం నిర్మాణ పనులను ప్రారంభించిన కొత్త భవనం నిర్మాణంలో ఉన్న పనులను మధ్యలోనే ఆగిపోయాయని. కావున అధికారులు వెంటనే స్పందించి పనులను పూర్తి చేయించాలని కోరారు. మెరుగైన విద్య అందకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త భవనం నిర్మాణ పనులను పూర్తి చేసి అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థులకు సురక్షితమైన అనుకూలమైన వాతావరణాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, విద్యార్థులకు విద్య ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం బాలాపూర్ మండల కో కన్వీనర్ కొల్లూర్ భీమేష్, ఎం.వి. ఫౌండేషన్ బాలాపూర్ మండల ఇన్‌చార్జి కే.ముకుందం ,విద్యార్థుల హక్కుల శ్రేయస్సు వారి విద్య పురోగతిని ఎల్లప్పుడూ ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



బడంగ్‌పేట్ ZPHS

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ గ్రామానికి చెందిన కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారని వేముల మహేశ్వర్ గౌడ్ బొక్క కృష్ణారెడ్డి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఘనపూర్ గ్రామానికి చెందిన కొమ్మూరు ప్రతాపరెడ్డి ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సర్వేనెంబర్ 1140 అండ్ 1141లో ప్రభుత్వం నుండి మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ బిల్డింగ్‌లను నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్న యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతల నిరసన





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపి నిధుల కేటాయింపులలో అన్యాయం చేశారని, దానికి నిరసనగా సోమవారం టీపీసీసీ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్ బాగ్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణకు సరైన విధంగా నిధులను విడుదల చేయాలని నిరసన తెలిపినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్, జీఎన్‌వీ సతీష్ కుమార్, బీకే శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌రెడ్డి, గుండా నిరంజన్, రాందాస్ సంతోష్ ముదిరాజ్ డివిజన్స్ అధ్యక్షులు సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, ఉమేష్ సింగ్, ప్రసాద్ యాదవ్, పంజాబ్ శ్రీనివాస్ యాదవ్, సయ్యద్ మబ్బు, బాబు, సత్యనారాయణ, శ్రీరామ్, కన్నా, ఇస్తారీ, చెన్నారెడ్డి, కన్నెమల్ల నాగరాజు, ప్రభ, శారద, ఆశా, అర్వరాజు, వెంకటేశ్వరరావు, బాలరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

మేడ్చల్‌లో..

బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, ఎన్డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారని ఆరోపించారు.అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించినట్లయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు బేరి ఈశ్వర్,నరేందర్,నాయకులు మారేపల్లి సుధాకర్, లక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ యూత్ అధ్యక్షుడు నవీన్ ముదిరాజ్,మహిళా అధ్యక్షురాలు బొజ్జ ఆది లక్ష్మి,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'కులాల వారీగా కులగణన లెక్కలను బహిర్గత పర్చాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర సర్వే వివరాలను కులాల వారిగా బహిర్గత పర్చాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామంలో చేసిన కులగణన సర్వే వివరాలను బహిర్గత పర్చాలన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 56 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని కోకారు.

ఇంటి టాక్స్ కట్టుకొని ఆన్‌లైన్‌లో పేరు వచ్చేలా చూడాలి

- ఇంటి టాక్స్ తగ్గించి, ఉచితంగా నల్లా కనెక్షన్ ఇవ్వాలి
- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్
- ప్రజా దర్బార్‌లో బీజేపీ నాయకుల వినతి



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ పరిధిలోని ఇండ్లకు ఇంటి టాక్స్ కట్టుకొని ఆన్‌లైన్‌లో ఇంటి యజమాని పేరు వచ్చేలా చూడాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజాదర్బార్‌లో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగుల శంకర్ మాట్లాడుతూ జవహర్ నగర్ గ్రామకంఠంలో నివసించే వారికి, ఇల్లు కట్టుకున్న అర్హులైన వారికి వెంటనే ఇంటి టాక్స్ తీసుకోవాలని, వెంటనే డాక్యుమెంట్ చెక్ చేసి వారి పేరు ఆన్‌లైన్‌లో వచ్చే విధంగా చేయాలన్నారు. 2018, 2019, 2020 వరకు కట్టిన టాక్సీలు మాన్యువల్‌గా ఇచ్చి, టాక్స్ రిసిప్ట్ ఆన్‌లైన్‌లో చేర్చకపోవడం వల్ల "హోల్డర్ అఫ్ ది ప్రాపర్టీ" అని వస్తుందని తెలిపారు. ఇలా ఉండడం వలన రిజిస్ట్రేషన్ కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు మాన్యువల్‌గా కట్టిన టాక్స్‌లను ఆన్‌లైన్‌లో వచ్చేలా చేయాలని అన్నారు. డంపింగ్ యార్డ్ బాధితులకు టాక్స్ తక్కువగా ఉండాలని, ఉచితంగా నల్లా కలెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా సెక్రటరీ ముత్యం సుజాత, ఓబీసీ మోర్చా నాయకులు మహేష్ గౌడ్, కోస్గి శివ కేశవ్, శ్రీనివాస్ గౌడ్, రాహుల్ సింగ్, మెలై కుమార్, నోముల సాయినాథ్, విగ్నేష్, భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- మాజీ కౌన్సిలర్ కౌడ్ మహేష్

నవతెలంగాణ-మేడ్చల్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు కౌడే మహేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ప్రశంసించి బడ్జెట్‌లో మాత్రం తగిన నిధులను కేటాయించకపోవడం దురదృష్టకరంమని తెలిపారు. ఎన్డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారన్నారు. కేంద్ర జీడీపీలో తెలంగాణ రాష్ట్రం వాటా 5శాతం ఉన్నా నిధులు మాత్రం కేటాయించలేదన్నారు. పన్నుల రూపంలో రూ.26వేల కోట్లు కేంద్రానికి వెళ్లినా రాజకీయ కారణాలతోనే చిన్నచూపు చూశారని ఆరోపించారు. 8మంది బీజేపీ ఎంపీలు గెలిచి అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలకు మోదీ సర్కార్ ద్రోహం చేసిందని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ వంటి కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కనీస సహాయాన్ని ప్రకటించకపోవడం తెలంగాణ ప్రజలకు అన్యాయ చేయడమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నిత్యాన్నదాన సత్ర భవనానికి స్థలం కేటాయించాలి



నవతెలంగాణ-కీసర

కీసరగుట్టలో మున్నురు కాపు సంఘం నిత్యాన్న దాన సత్ర భవనానికి స్థలం కేటాయించాలని శ్రీ రామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యం లో కీసరగుట్ట దేవస్థానం చైర్మెన్ తటకం నారాయణ శర్మను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షు లు చిందం మహేందర్ పటేల్, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి వెంకటేశ్వరరావు పటేల్, కోశాధికారి మల్యాల రమేష్ పటేల్, లక్ష్మణ్ పటేల్, మాడూర్ రవీందర్ పటేల్, రాచమల్ల లక్ష్మణ్ పటేల్, తోట నరేష్ పటేల్, సుధాకర్ పటేల్, గంద్ర కమలాకర్ పటేల్, రమేష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలు



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా సరస్వతీ అమ్మ వారి కటాక్షం ఉండాలని సెయింట్ పాల్స్ హైస్కూల్ డైరక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అవుషాపూర్ లోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో వసంత పంచమి సందర్భంగా విద్యార్థులతో కలిసి సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో స్కూల్ డైరక్టర్లు విజయ్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, శ్రవణ్, హెచ్ఎం సుశీల సింగ్, టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-ఉప్పల్



స్ఫూర్తి మహిళ డిగ్రీ కళాశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ రాపర్తి సురేష్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం సరస్వతి దేవి చిత్రపటానికి విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఆకాంక్షించారు.

నా కూతురు వివాహానికి రండి..

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా



ఈనెల 15 తేదీన ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ అంతాయిపల్లి, షామీర్‌పేట్ రోడ్డు సమీపంలో జరుగబోయే తన కూతురు అలేఖ్య రెడ్డి - శివ దినేష్ రెడ్డిల వివాహానికి రావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పెళ్లి శుభలేఖను డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ నాయకులకు, కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, కార్యదర్శి కుమార స్వామి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

c m y k



మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీ భారతీ విద్యా నికేతన్ లో కరస్పాండెంట్ వనజ సాయి లీల, శివప్రసాద్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో 22 వసంతాల వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆ పాఠశాలలో చదివిన, ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు ముఖ్య అతిథులుగా విచ్చేసి బహుమతి ప్రదానోత్సవం చేశారు.

నవతెలంగాణ-కాప్రా

నవ తెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

అభ్యర్థి అభ్యర్థిత్వాన్ని ప్రచారం చేసుకునే అవకాశం కల్పించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాఠశాల స్థాయిలో అభ్యర్థి అభ్యర్థిత్వాన్ని ప్రచారం చేసుకునే అవకాశం కల్పించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర శాఖ కోరింది. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పక్షాన రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, టీయూటీఎఫ్ అధికారిక ఎమ్మెల్సీ అభ్యర్థి జంగిటి కైలాసం, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటేశ్వరరావు, తదితరులు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ ఎన్నికల అధికారి సత్యవాణిని కలిసి గతంలో జిల్లా కలెక్టర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రచారంలో పాల్గొన వద్దనీ, ఒకవేళ పాల్గొంటే సస్పెన్షన్ విధిస్తామని ఉత్తర్వులు ఇవ్వడంపై అడగ్గా, ఇందుకు ఎలక్షన్ కమిషన్‌కు ఎలాంటి సంబంధం లేదనీ, ప్రస్తుతం ఎలక్షన్ పరిధిలోకి వచ్చినందున ముగ్గురు రిటర్నింగ్ అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తామనీ, రిటర్నింగ్ అధికారుల పర్మిషన్ తీసుకుని ప్రచారం చేసుకోవాలని సూచించినట్టు తెలిపారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని ముదిరాజ్ కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. నియోజకవర్గ ముదిరాజుల సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం వరకు చింతల్ పరిధి హెచ్ఎంటి కాలనీలోని నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఇందులో భాగంగా నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా ఆరె రామకృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా గరిగే శేఖర్ ముదిరాజ్, కోశాధికారిగా జింకల వెంకటేష్ ముదిరాజ్‌తో పాటు మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.పద్మ ముదిరాజ్, నాగమణి ముదిరాజ్ కోశాధికారిగా శ్వేతా ముదిరాజ్‌లను యూత్ విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా ఉదయ్ గంజి ముదిరాజ్, సిహెచ్.మధు ముదిరాజ్ కోశాధికారిగా శరత్ ముదిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే, వారు కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ అభ్యున్నతికి పాటుపడాలని వర్గ విభేదాలకు తావు లేకుండా ముందుకెళ్లాలని సూచించారు. తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను శాలువతో సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సారా శంకర్ ముదిరాజ్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

గణేష్ నగర్ "అమృతాలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల " కరపత్రిక, గోడపత్రికలను ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద గణేష్ నగర్ అమృతాలయం దశమ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రిక, గోడపత్రికలను ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, లింగం, భాస్కర్ గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి 54వ బ్రహ్మోత్సవాలు



జగద్గిరిగుట్ట పోలీసుల పట్టిష్ట బందోబస్తు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (శ్రీవారి) 54 బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారి అభిషేకము, ధ్వజారోహనము,హెూమము,12 గంటలకు శ్రీవారి కల్యాణ మహోత్సవం పోటెత్తిన భక్త జన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి.వివేకానంద,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి,పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి,స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, గాజులరామరం కార్పొరేటర్ రావుల శేషగిరి రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్‌లు హాజరై శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణమాచార్యులు, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు నాయకులకు స్వాగతం పలికారు. జగద్గిరిగుట్ట నుండి కాకుండా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జగద్గిరిగుట్ట సిఐ. కె.నరసింహ,ఎస్ఐ.శంకర్‌ల నేతృత్వంలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఎటువంటి అ సౌకర్యాలు జరగకుండా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,సంబంధిత దేవాలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం,స్థానిక ఆర్యవైశ్య సంఘం,ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు,గుట్ట వైశ్య సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ కానుగంటి నరేందర్ రెడ్డి,ధర్మకర్తలు,వైశ్య సంఘం ప్రతినిధులు ఉప్పల రమేష్ గుప్తా,రేగురి ప్రవీణ్ కుమార్ గుప్తా,తేరాల శ్రీనివాస్ గుప్తా,అన్నయ్య గుప్తా,మహంకాళి సురేష్ గుప్తా,ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు సిహెచ్.భాస్కర్ రెడ్డి,పాండాల శ్రీనివాస్ గౌడ్,కూరపాటి శ్రీరామరాజు,ఏ.వీరేశప్ప,ఎస్.నరేందర్ రాజు,బొగ్గుల సురేష్,బింగి శ్రీనివాస్ గౌడ్,పి .శేషారెడ్డి,జె.జగన్మోహన్,ఆర్.నరేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.అనంతరం సాయంత్రం పురవీధుల్లో స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో వసంత పంచమి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ "సత్యవాణి విద్యా నికేతన్", ఎస్ ఆర్ నాయక్ నగర్, "టీవీఆర్ మోడల్ హై స్కూల్ " అపురూప కాలనీలలో సోమవారం భక్తిశ్రద్ధలతో చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టినరోజు (వసంత పంచమి) వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీవీఆర్ విద్యాసం స్థల మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ మాఘ శుద్ధ పంచమిని వసంత పంచమి, శ్రీ పంచ మి, మదన పంచమి అని కూడా పిలుస్తారన్నారు. సరస్వతి జయంతి పేర్లతోనూ పిలిచే ఈ రోజున పూజిస్తారు. మాఘమాసం కనుక చెట్లు చిగురించడం పూలు పూయడం పచ్చని ప్రకృతి అందాల వంటి లక్షణాలతో ప్రకృతి శోభాయ మయంగా ఉంటుందని తెలిపారు. అన్ని సిరులకి మూలాధారం చదువు. కళలు, శాస్త్రాలు, వృత్తులు, మేదస్సు, వాక్ బుద్ధి, అన్నింటికీ అధిష్టాన దేవత సరస్వతీ దేవి శ్వేత వస్త్రాలను ధరించి హంస వాహనంతో తెల్లటి తామర పుష్పంపై చదువుల తల్లి కొలువుతీరి ఉంటుందన్నారు. హస్త భూషణమైన వీణ సకల కళావల్లభుడు కళలకు మూలం మనిషిలోని మనో కాలుష్యాన్ని పాశంకులాలు హరింపజేసే ఆయుధాలకు సంకే తాలు పాలని నీటిని వేరు చేసే హంస మంచి చెడుల విచక్షణా జ్ఞానంతో మెల గాలని సూచిక భావిస్తారు. మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి చేతుల మీదుగా పూజ చేసి, అనంతరం విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పెన్సిళ్లు పంపిణీ చేశారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి దీప్తి రెడ్డిలు వసంత పంచమి సందర్భంగా అధ్యాపక బృందానికి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ.ఎస్.పి.ఆర్. గ్లోబల్ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు..

జగద్గిరిగుట్ట: చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పుతూ భావి తరాలకు దిక్సూచి గా నిలిచే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని శ్రీ ఎస్.పి.ఆర్.గ్లోబల్ పాఠశాల చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు.సోమవారం వసంత పంచమి పురస్కరించుకొని గాజులరామారం డివిజన్ చిత్తరమ్మదేవి నగర్ లో గల పాఠశాల ఆవరణలో ముందుగా పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతోపాటు, సంస్కారం,విలువలతో కూడిన విద్యనందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సొంటిరెడ్డి చైతన్య పున్నారెడ్డి, ప్రిన్సిపల్ గ్లోరీ, వైస్ ప్రిన్సిపల్ ఆకాష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణ లో శ్రీ ఎస్.పి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సృజన హాస్పిటల్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జగద్గిరిగుట్ట సిఐ.కె.నరసింహ హాజరై ప్రారంభించారు. సాధారణ వివిధ విభాగాల డాక్టర్ల చే సుమారు 100 పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

ప్రిన్సిపాల్ సెక్రెటరీ యోగిత రాణాకు సత్కారం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సంఘం (ఔటా) ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి డా.యోగితా రాణాని ఓయూ ఔటా ఘనంగా సన్మానించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకుల పదవీ విరమణ వయస్సును పెంచే దిశగా ఆమె విశేష కృషికి చేసినట్టుగా కృతజ్ఞతగా ఈ సన్మానం జరిగిందని ప్రొ. మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఔటా ప్రతినిధులు మాట్లాడుతూ.. డా. యోగితా రాణా అంకితభావం, ఉన్నత విద్యాభివృద్ధికి చేసిన కృషి, అధ్యాపకుల సంక్షేమం పట్ల చూపిన నిబద్ధతను కొనియాడారు. ఆమె నిరంతర సహకారం వల్ల రాష్ట్రంలో ఉన్నత విద్యా రంగం మరింత బలోపేతం అవుతోందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఔటా అధ్యక్షుడు ప్రొ. మనోహర్, కార్యదర్శి ప్రొ. సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరి ప్రొ. గంగాధర్ ప్రొ. కృష్ణయ్య సభ్యులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్

- రూ.28.26లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



నవతెలంగాణ-బేగంపేట

ఇండ్ల తాళాలు, షాపుల షెట్టర్లు పగుల గొట్టి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.28.26 లక్షల నగదు, నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మహంకాళి పోలీసు స్టేషన్‌లో ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాంతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర బీవండికి చెందిన బట్టల వ్యాపారి మురళీధర్ మోహన్‌లాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బట్టల వ్యాపారి చంద్రభాన్ పటేల్, ఉత్తరప్రదేశ్ బనారస్లోని ఓ బిస్కట్ కంపెనీలోవాచ్‌మెన్‌గా పనిచేసే ఉద్యయాజ్ సింగ్. లాక్‌డౌన్‌కు ముందు ఈ ముగ్గురు సికింద్రాబాద్‌లో బట్టల వ్యాపారం చేసేవారు. ఫుట్‌పాత్‌పై దుస్తులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వీరు కరోనా లాక్‌డౌన్‌లో వ్యాపారం మూత పడింది. దీంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో ముగ్గురు కలిసి రాత్రి సమయాల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇండ్లు, మూసి ఉన్న షాపుల షెట్టర్లు తొలగించి అందులో దాచిన డబ్బులు దొంగిలించాలని ప్లాన్ వేసుకున్నారు. సికింద్రాబాద్‌లో బట్టలు విక్రయించిన వీరికి ఈ ప్రాంతంలో ఏయే షాపుల్లో అధికంగా వ్యాపార లావాదేవీలు జరుగుతాయో ముందే తెలిసి ఉండటంతో అలాంటి షాపులనే టార్గెట్‌గా చేసుకున్నారు. ఇదే క్రమంలో గత నెల సికింద్రాబాద్‌లో సితారా లాడ్జ్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. గత నెల 31న సికింద్రాబాద్ ఓల్డ్ బోయిగూడ ప్రాంతంలో ఉన్న డీప్ ఇంజినీరింగ్ కంపెనీకి వెళ్లారు. ఈ కంపెనీ కార్యాలయ భవనం షెటర్లు తొలగించి లోపలికి వెళ్లారు. లాకర్‌ను పగుల గొట్టి అందులో ఉన్న రూ.30.20లక్షల నగదును దొంగిలించి పరారయ్యారు. సదరు కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మహంకాళి పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా వారు సికింద్రాబాద్ సితారా లాడ్జ్‌లో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.28.26 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

బీఆర్ఎస్ నాయకుడు మృతి.. ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సనత్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుదర్శన్ రావు మృతి పట్ల, మాజీమంత్రి, సనత్‌నగర ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడుగా ఉండి, కాలనీ అభివృద్ధికి కృషిచేశారు. సుదర్శన్ రావు మృతి వార్త తెలుసుకొని సనత్ నగర్‌లోని ఆదిత్య నగర్‌లో ఉన్న వారి నివాసానికి వెళ్ళి ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఖలీల్, అమీర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ మణి కుమార్, నాయకులు శేఖర్, షాబాద్ శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

నిమ్స్ ప్రొఫెసర్ ఉషారాణికి "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్-అకాడెమియా" అవార్డు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశ క్లినికల్ పరిశోధన రంగంలో చేసిన విశేషమైన కృషికి గానూ, నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ విభాగాధిపతిగా సేవలందిస్తున్న సీనియర్ ప్రొఫెసర్, డాక్టర్ పింగళి ఉషారాణిని భారత క్లినికల్ పరిశోధన సమాఖ్య నిర్వహించిన 18వ వార్షిక సదస్సులో "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్-అకాడెమియా" అవార్డుతో సత్కరించింది. ఈ పురస్కారాన్ని ఐఎస్‌సీఆర్ అధ్యక్షుడు డాక్టర్ సానిష్ డేవిస్, గౌరవ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీమా పాయ్ అందజేశారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప డాక్టర్ ఉషారాణి పింగళిని అభినందించారు. క్లినికల్ పరిశోధనలో నూతన ప్రయత్నాలను ప్రోత్సహించడం, శాస్త్రీయ ప్రమాణాలను మెరుగుపర్చడం, నైతిక పరిశోధనా విధానాలను పెంపొందించడం ద్వారా నిమ్స్‌లో క్లినికల్ పరిశోధన ప్రమాణాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఆమె చేసిన కృషిని ప్రశంసించారు. డాక్టర్ ఉషారాణి పింగళి మాట్లాడుతూ "ఈ అవార్డు నిమ్స్‌లోని క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ విభాగం కృషికి గుర్తింపుగా భావిస్తున్నాను. ఈ అవార్డును ఇచ్చిన ఐఎస్‌సీఆర్‌కి నా హృదయపూర్వక కతజ్ఞతలు. నాణ్యతతో కూడిన క్లినికల్ పరిశోధన నిర్వహించడానికి ప్రోత్సహించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కతజ్ఞతలు" అని తెలిపారు. డాక్టర్ ఉషారాణి పింగళి మూడు దశాబ్దాలుగా భారతదేశంలో క్లినికల్ పరిశోధన అభివద్ధికి, నైపుణ్య వద్ధికి కీలక పాత్ర పోషించారు. ఆమె నిర్వహించిన పరిశోధనాత్మక క్లినికల్ ట్రయల్స్, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, క్లినికల్ పరిశోధనా నిపుణులకు మార్గదర్శకత్వం అందించడం, అలాగే క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ విభాగాన్ని అభివద్ధి చేయడంలో ఆమె చేసిన నిరంతర కషి భారతదేశంలోని క్లినికల్ పరిశోధన రంగం అభివద్ధికి దోహదపడింది.

కులగణనను వెంటనే పునఃసమీక్షించాలి

- అశాస్త్రీయ కులగణగా అభివర్ణిస్తున్నాం
- బీసీ ఇంట్యాలెక్చువల్ ఫోరం



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన అసలు అది సబ్బండ వర్గాల కులగణనే కాదని ఇది పూర్తిగా అశాస్త్రీయంగా జరిగిన కులగణగా అభివర్ణిస్తూ వెంటనే దీన్ని పునఃసమీక్షించాలని బీసీ ఇంట్యాలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. భారతదేశ జనాభా పెరుగుతూ పోతుందా తగ్గుతూ పోతుందా అనే ప్రశ్నకు ముందుగా సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ అనేక సమావేశాలు చేస్తున్న తాము బీసీ కులగణనతో పాటు సమగ్ర కుటుంబ సర్వేను ఆధారం చేసుకుని కులగణన చేపడుతామన్న ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామన్నారు. రాహుల్ గాంధీ సైతం ఈ వాక్యాలను ఏకీభవించారనీ ప్రస్తుతం బీహార్ కుల గణన సరిగ్గా లేదని వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ బీహార్ రాష్ట్రంలో మరో మారు కులగణను చేశారనే విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరిగిన కులగణన సర్వే సైతం అదే మాదిరిగా ఉందని ఆరోపిస్తూ తక్షణమే మంత్రివర్గ కమిటీలో బీసీ కులాలకూ చెందిన నాయకులకు కాకుండా ఓసీ నాయకులు ఈ కమిటీలో ఉండటం ప్లానింగ్ కమిటీ డిప్యూటీ సీఎం చేతిలో ఉంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏ పదవిలో లేని జానా రెడ్డి సలహాలు సూచనలు పరిగణంలోకి ఎలా తీసుకున్నారో తెలపాలని ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రినీ ప్రశ్నించారు. గతంలో జరిగిన సర్వేల్లో అవకతవకలు ఉన్నాయని చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఏకంగా 37 రాష్ట్రాలు బీహార్‌లో ఉంటే 70కి పైగా ప్రశ్నలు పెట్టి, బీసీ జనాభా మాత్రమే తగ్గించి చూపడన్ని ప్రశ్నించారు. కొన్ని సందర్భాల్లో కులగనలలో పట్టణ ప్రాంతాలతో పాటు ప్రధాన మున్సిపాలిటీలు పాల్గొనని వారి లెక్కలను అధికారం ఉందని వీరే రాసుకొని వారు పెరిగారు. వీరు తగ్గారని సంఖ్యలు తగ్గించి చూపించిన ఈ లెక్కలు పూర్తిగా అశాస్త్రీయంగా జరిగినట్టు భావిస్తూ త్వరలోనే అన్ని బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తమ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. బీసీల జనాభా రాష్ట్రంలో 60 శాతం, కంటే తక్కువగా ఉండదాని సవాల్ చేస్తూ 45 శాతం చూపడం కుట్రగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, బాలరాజ్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారి శ్రీవాణి వెంకట్రావు వసంత పంచమి సందర్భంగా సోమవారం రామంతాపూర్‌లో సరస్వతి మాత సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి పూజలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్, వెంగల్ రావు నగర్ డివిజన్ మధుర నగర్ డీ బ్లాక్‌లోని పార్కు అభివృద్ధికి రూ.16 లక్షల వ్యయంతో పునః నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యా రావు, జీహెచ్ఎంసీ డీఈ రామచంద్రరావు, యుబీడీ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ చంద్ర, సానిటరీ సూపర్వైసర్ విజయ్ కుమార్, మధుర నగర్ కాలనీ ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డి, సాంబశివ రావు, సుగుణ, పద్మావతి, విజయవాణి, మనోహర్రావు, రేలంగి నరసింహారావు, డివిజన్ ప్రెసిడెంట్ విజయ్, శ్యామ్ రావు, విజయ సింగ్, శారదా, సుజాత, వాణి, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

బీసీల జనాభా శాతాన్ని తక్కువగా చూపారు

- జాజుల లింగంగౌడ్



సమగ్ర కులగణన పూర్తి స్థాయిలో జరగలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిన్న ప్రకటించిన సర్వే నివేదిక తప్పులతడకగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుంది. మా అంచనా ప్రకారం తెలంగాణ జనాభాలో బీసీల జనాభా 60 శాతానికి పైగా ఉండాలి. గతంలో కంటే ఇప్పుడు బీసీ జనాభా తగ్గినట్టు చూపించారు. బీసీల కులాల వారీగా జాబితా ఇవ్వాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-చంపాపేట్



వసంత పంచమిని పురస్కరించుకొని కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో సోమవారం సరస్వతి మాత అమ్మవారికి ప్రత్యేక అభిషేకము, అలంకరణ అనంతరం సామూహిక అక్షరాభ్యాసములు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేపట్టారు. భక్తులు వారి చిన్నారులకు అక్షరాభ్యాసములు నిర్వహించడం కోసం ఆలయానికి విచ్చేయగా అర్చకులు వారిచే అక్షర స్వీకార పూజలు నిర్వహించారు. అక్షరాభ్యాసముల వద్ద టెంట్లు వేసి సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. లావణ్య ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది భక్తులకు అక్షర స్వీకార కార్యక్రమం నిర్వహించారు.

హైడ్రా ప్రజావాణికి 71 ఫిర్యాదులు

రహదారుల కబ్జాలను వెంటనే తొలగించాలన్న హైడ్రా కమిషనర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గేటెడ్ కమ్యూనిటీల మాదిరి కాలనీల చుట్టూ రహదారులను నిర్మించిన పక్షంలో వాటిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి 71కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులపై అక్కడికక్కడే హైడ్రా అధికారులతో చర్చించి చర్యలకు హైడ్రా కమిషనర్ ఆదేశించారు. మొత్తం ఫిర్యాదుల్లో అధికభాగం పార్కులు, రహదారుల కబ్జాలే ఉన్నాయని.. లే ఔట్ ప్రకారం రహదారులుండేలా చూడాలని సూచించారు.

ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను గూగుల్ మ్యాప్స్‌ద్వారా పరిశీలించి.. దశాబ్దం క్రితం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందో తెలుసుకున్నారు. ఫిర్యాదు దారులకు కూడా చూపించి.. సమస్య పరిష్కారానికి చర్యలు సూచించారు. ఫిర్యాదుదారులు సంప్రదించాల్సిన హైడ్రా అధికారులను పరిచయం చేసి.. వారు విచారణకు వచ్చిన సమయంలో అన్ని వివరాలు అందజేయాలని సూచించారు. ఒకప్పుడు సెప్టిక్ ట్యాంకుల కోసం కేటాయించిన స్థలాలను.. ఇప్పుడు వినియోగంలో లేవని.. వాటిని ప్రజావసరాలకు కేటాయించిన స్థలంగానే పరిగణించాలని.. ఎవరైనా కబ్జాలుచేస్తే వెంటనే వాటిని తొలగించాలని కమిషనర్ అధికారులకు సూచించారు.

కాప్రా మున్సిపాలిటీలో వంపుగూడ పక్కన ఉన్న ఎస్ ఆర్ ఐ కాలనీవాళ్లు ప్రహరీ నిర్మించారు. చందానగర్ సర్కిల్ 21లోని మాతృశ్రీనగర్‌లో పార్కులో కొంత భాగాన్ని, పార్కులో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌ను కబ్జా చేశారంటూ ఫిర్యాదు వచ్చింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం, కోహెడ గ్రామంలో సమ్మిరెడ్డి బాల్ రెడ్డి తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ పలువురు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 951 నుంచి 954 లలో 1986లో గ్రామపంచాయతీ లే ఔట్‌లో తాము ప్లాట్లు కొంటే వాటిని చూడలేని పరిస్థితి ఉందన్నారు. తమ ప్లాట్లను కొన్నిటిని కాజేసి ఫామ్ హౌస్ మాదిరి చుట్టూ ప్రహరీ నిర్మించుకుని ఎవరినీ అనుమతించడంలేదని ఫిర్యాదు చేశారు.

నల్లమల్లారెడ్డి మా ప్లాట్లను తీసుకున్నారు

"మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల్ గ్రామ పంచాయతీలో మా ప్లాట్లను నల్ల మల్లారెడ్డి కబ్జా చేశారు. సర్వే నంబరు 716 నుంచి 718లో గ్రామపంచాయతీ లేఔట్‌లో తనతో పాటు 23 మంది 1987లో కొన్న ప్లాట్లను నల్లమల్లారెడ్డి కాజేశారు. 2010లో రెవెన్యూ , రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన రికార్డులను ట్యాంపెరింగ్ చేసి తన కబ్జాలో పెట్టుకున్నారు. నల్లమల్లారెడ్డిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు కూడా 2013లో పెట్టాం. మొత్తం 23 కేసుల వివరాలతో ఆంధ్ర ప్రదేశ్ గజెట్ కూడా ప్రచురితమైంది. విద్యాసంస్థల అధినేత నల్ల మల్లా రెడ్డి మా ప్రైవేట్ ప్లాట్లను మాత్రమే కాకుండా, ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించి, తన రాజకీయ శక్తిని ఉపయోగించి వాటిని అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, హైడ్రా జోక్యం చేసుకోవడం అత్యంత అవసరం. హైడ్రా దీనిపై దర్యాప్తు చేపట్టినట్లయితే, మా ప్రైవేట్ ప్లాట్లతో పాటు ప్రభుత్వ భూమిని కూడా రక్షించగలదు"

– మీరన్ మొయినుద్దీన్.

యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువును కాపాడండి

మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మల్కాజిగిరి మున్సిపాలిటీలోని యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువును ఫంక్షన్ హాల్ యజమానులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని.. గతంలో రెండు సార్లు స్థానిక ఎంఆర్‌వో కూల్చివేయగా.. ఇటీవల హైడ్రా కూడా కూల్చింది. ఈ చెరువు నాలాను పూర్తిగా ఆక్రమించిన ఫంక్షన్ హాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలి. కబ్జాలను తొలగించి చెరువును కాపాడాలి. అనుమతి లేని ఫంక్షన్ హాల్‌ను తొలగించాలి.

– యాప్రాల్ కులసంఘాల జేఏసీ ఛైర్మెన్ ఆర్. చంద్రశేఖర్.

ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఇప్పించండి

నేను మాజీ సైనిక ఉద్యోగిని. ప్రభుత్వం తనకు కూకట్‌పల్లి – నిజాంపేట రోడ్డులోని హోలిస్టిక్ ఆస్పత్రి వెనుక 300ల గజాల స్థలాన్ని కేటయించింది. తనకు ఇచ్చిన 300ల గజాలతో పాటు.. మొత్తం 1253 గజాల స్థలాన్ని స్థానిక మహిళ కబ్జాచేసింది. ఇదంతా ప్రభుత్వ స్థలమని.. కోర్టు ఉత్తర్వులతో పాటు.. ప్రభుత్వ ఆదేశాలున్నా తనకు 300ల గజాల స్థలం దక్కడం లేదు. ప్రభుత్వ భూమిని కబ్జాదారు నుంచి కాపాడి.. తనకు ప్రభుత్వం కేటాయించిన 300ల గజాల స్థలం వచ్చేలా హైడ్రాచూడాలి.

– పి. సీతారామరాజు, మాజీ సైనిక ఉద్యోగి.



సంక్లిష్టమైన కేసుల దర్యాప్తులో రాచకొండ ఐటీ సెల్ ముఖ్యపాత్ర

- **కమిషనరేట్ పరిధిలో నేర నియంత్రణలో ఐటీ సెల్ పాత్ర అభినందనీయం**
- **సీపీ సుధీర్ బాబు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ ఐటి సెల్ విభాగ అధికారులు, సిబ్బందితో కమిషనర్ సుధీర్ బాబు, ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ సెల్ సోషల్ మీడియా, సిసిటిఎన్ఎస్, కోర్ టీమ్, సిఇఐఆర్, ప్రజావాణి ఫిర్యాదుల వంటి పలు విభాగాల పనితీరును, ఫలితాల ప్రగతిని కూలంకషంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో నమోదైన పలు ప్రాధాన్యమైన, సంక్లిష్టమైన కేసుల దర్యాప్తులో రాచకొండ ఐటీ సెల్ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని అభినందించారు. హత్య కేసులు, ప్రాపర్టీ నేరాలు, చైన్ స్నాచింగ్, వాహన దొంగతనాలు, మొబైల్ దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల వంటి పలు సంక్లిష్టమైన కేసులను త్వరితగతిన చేదించడంలో సాంకేతికపరమైన తోడ్పాటు అందిస్తూ ఐటీ సెల్ బృందం కృషి చేస్తోందని కమిషనర్ ప్రశంసించారు. రాచకొండ ఐటీ సెల్ సమర్థవంతమైన పనితీరు ద్వారా ఎన్నో సంక్లిష్టమైన నేరాల్లో సాంకేతికపరమైన సాక్ష్యాల సేకరణ ద్వారా అసలైన నిందితులను వీలైనంత తక్కువ సమయంలోనే పట్టుకోవడం సాధ్యమైందని, నేరస్తులకు ఖచ్చితమైన, కఠినమైన శిక్షలు పడడం జరుగుతోందని పేర్కొన్నారు.

కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, రోడ్డు ప్రమాదాలు, స్త్రీలు మరియు పిల్లల అపహరణ వంటి ఎన్నో కేసులలో బలమైన సాక్ష్యాధారాలను ప్రతీ ఏరియాలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు అందిస్తున్నాయని సీపీ ప్రశంసించారు. సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజల్లో మరింతగా ప్రచారం చేయాలని, ఇప్పటికే అమర్చిన కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. నేరుగా పోలీస్ స్టేషన్కు రాలేని మరియు అత్యవసర పరిస్థితుల్లో చిక్కుకున్న బాధితులు ఉపయోగించుకునే సోషల్ మీడియా విభాగం మరింత వేగంగా స్పందించాలని సూచించారు. నేర శాతాన్ని తగ్గించడానికి రాచకొండ పోలీసులు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను సామాజిక మాధ్యమాల్లో మరింతగా ప్రచారం చేయాలని, కళాశాలల్లో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు తగ్గేలా ఎప్పటికప్పుడు వారితో సమన్వయం చేస్తూ పని చేయాలని, కేసుల దర్యాప్తులో వారికి అవసరమైన సహాయాన్ని వేగంగా అందించాలని సూచించారు.



కమిషనరేట్ పరిధిలో నేర నియంత్రణకు, కేసుల వేగవంతమైన దర్యాప్తులో ఎంతో ముఖ్యమైన ఐటీ సెల్ విభాగాన్ని సాంకేతికపరంగా మరింత బలోపేతం చేయడానికి అవసరమైన తోడ్పాటు, మరియు సిబ్బందికి ప్రోత్సాహాన్ని తప్పక అందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఐటీ సెల్ విభాగంలోని ప్రతి ఒక్కరూ మరింతగా తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపెరుచుకోవాలని, నూతన సాంకేతిక వనరులను ఉపయోగించుకుని కేసుల దర్యాప్తును సులభతరం చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఐటీ సెల్ ఏసిపి నరేందర్ గౌడ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శిగా కుర్రాడి శ్రీనివాస్




- **శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా జిల్లా ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం కేంద్ర సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) చేతుల మీదుగా జిల్లా కొత్త అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ నూతన అధ్యక్ష, కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తూ.. జిల్లాను ముందుకు కొనసాగించాలన్నారు. ఉద్యోగుల సమస్యలే ప్రధాన బాధ్యతగా ఉండాలని చెబుతూ.. వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో అగ్రస్థానంలో ఉందని అదే ఒరవడిని కొనసాగించాలనీ, ఇంతకుముందు ఎంత నిబద్ధతతో జిల్లా కార్యవర్గం పనిచేసిందో.. దానిని అలాగే ముందుకు తీసుకువెళ్లాలన్నారు. జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్ కుర్రాడి శ్రీనివాస్ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుర్రాడి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కార్యదర్శిగా నియమించినందుకు కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని, జిల్లా అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

నవాతెలంగాణ-తుర్కయంజాల్



తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీవాసులకు రాగన్నగూడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సామ భీంరెడ్డి సాజన్యంతో బొక్క భూపాల్ రెడ్డి సహకారంతో సోమవారం దుప్పట్లు, టిఫిన్ బాక్సులు, బకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామ భీంరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఎల్లవేళలా లయన్స్ క్లబ్ సేవలను అందజేస్తుందన్నారు. ముందు ముందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఉచిత కంటి పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అవసరమైన వారికి చికిత్స లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేవెల్లె హరిత యాదగిరి గోదాసు భద్రయ్య, పూజారి నందీశ్వర్,

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

నేటి నుంచి ఉచిత క్యాన్సర్ నిర్ధారణా శిబిరం

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ సంస్థ వారు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఫిబ్రవరి 4 నుంచి 28 ఫిబ్రవరి తారీఖు వరకూ నిర్వహించే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరంలో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ క్యాన్సర్ వైద్య నిపుణులచే ఉచిత ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. తదుపరి అవసరమైన వారికి 20 శాతం తగ్గింపుతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవడానికి వీలు కల్పిస్తారు. అంతే గాకుండా ఫిబ్రవరి నెలంతా అత్యంత తక్కువ ఖర్చుతో హెచ్‌పీవి వ్యాక్సిన్ వేయించుకొనే సదుపాయాన్ని అందుబాటులోనికి తెచ్చారు. డోసు ఒక్కంటికి షుమారు 4 వేల రూపాయల ఖరీదైన ఈ వ్యాక్సిన్ ను కేవలం ఒక డోసు 1500 రూపాయలకే అందించనున్నాను. 9 సంవత్సరముల నుండి 14 సంవత్సరముల వయస్సు కలిగిన ఆడపిల్లలకు ఆరు నెలల వ్యవధిలో రెండు డోసుల ఇంజక్షన్లు వేయించుకోవాల్సి ఉండగా 15 నుండి 26 వయస్సున్న యువతులకు మూడు డోసుల వ్యాక్సిన్ అంటే ఆరునెలల వ్యవధిలో మూడు డోసులు వేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా రెండు డోసులు అవసరమున్నా లేదా మూడు డోసులు అవసరమున్నవారికి కూడా డోసు 1500 రూపాయలతోనే హాస్పిటల్ అందించనుంది. ఇది ఫిబ్రవరి మాసంలో మొదటి డోసు వేయించుకొన్న వారికి మాత్రమే అందుబాటులో ఉంటుందనీ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నేరుగా కానీ ఈ నెంబర్ ద్వారా 040-23551235 ఈఎక్స్‌టీఎన్ 2335 సంప్రదించాలనని కోరారు.

రిస్క్ మేనేజ్‌మెంట్ కష్టమైనా ఛాలెంజింగ్‌గా ఉంటుంది



- హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కన్నెగంటి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కన్నతల్లిని, మాతృభూమిని ప్రేమించినపుడు అన్ని దేశాలు సుభిక్షంగా వుంటాయని, ఈ రెండింటిని మరిచినవాడే దేశద్రోహానికి పాల్పడతాడని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి కేంద్రం సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కన్నెగంటి అన్నారు. దేశాభివృద్ధిలో భాగమైన బ్యాంకింగ్, హెల్త్ కేర్, ఇండస్ట్రీ, బిజినెస్, ఐటీ తదితర అనేక రంగాల్లో భాగమైన డిజిటైజేషన్ ను చోరీ చేసే ప్రక్రియలకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నస్తుంటారని, శాస్త్రవేత్తల మేధో మధనం ద్వారా ఉద్భవించిన కృత్రిమ మేధను కూడా సవాల్ చేస్తూ బ్లాక్ చైన్, ర్యాన్ సమ్ వేర్, క్రిప్టో కరెన్సీ, సిస్టమ్స్ హ్యాకింగ్ తదితర విధానాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే ప్రయత్నాలను విఫలం చేస్తూ భారత సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ దేశరక్షణలో కీలక భూమికను పోస్తిస్తున్నదన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సైంటిస్టులు మరియు టెక్నాలజిస్టులకు భారత సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద్వారా సోమవారం 3-2-2025 న ఏర్పాటు చేసిన టెక్నాలజీ రిస్క్ మేనేజిమెంట్ జాతీయ శిక్షణ కార్యక్రమంలో రమేష్ కన్నెగంటి ముఖ్య అతిథిగా మాట్లాడారు.. భారతదేశానికి చైనా, పాకిస్తాన్, బాంగ్లాదేశ్ తదితర ఏడు దేశాలతో 15 వేల కిలోవీటర్ల సరిహద్దుగల భూభాగాన్ని, శ్రీలంక, మయన్మార్ తదితర దేశాలతో గల సుమారు ఏడున్నర వేల కిలోమీటర్ల సముద్ర మార్గాన్ని మన సైనికులు నిత్యం కాపలా కాస్తూ దేశ రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రపంచ అత్యధిక స్థూల జాతీయ ఉత్పత్తిలో భారతదేశం అయిదవ స్థానంలోకి చేరడం మొదలైనవన్నీ కూడా శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖల్లో పనిచేస్తున్న సైంటిస్టులు, టక్నాలజిస్టులు కారణమన్నారు. ప్రపంచంలో అమెరికా, జర్మనీ, యూకే తరహాలో మనదేశంలో కూడా డేటా సెంటర్లు ఎక్కువగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో మరొక అతిథిగా పాల్గొన్న సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ శ్రీరామ్ బిరుదవేలు మాట్లాడుతూ టెక్నాలజీ లో రిస్క్ మేనేజ్ మెంట్ ను కాపాడుకోవాలంటే ఎక్సపీరియన్స్, ఎఫిషియన్సీ అవసరమన్నారు. రిస్క్ ఉందని అనుకుంటే దేశం ఇన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించేది కాదన్నారు. వినూత్న ఆలోచనలతో రిస్క్ ను ఎదుర్కొంటే అన్ని రంగాల్లో విజయం స్వంతమన్నారు ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ దేశ పురోభివృద్ధిలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. గత నలభై ఏళ్లుగా ఇక్కడ వేలాది మంది ఇంజనీర్లు, సైంటిస్టులకు భారత ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల సహకారంతో దేశంలోని గొప్ప గొప్ప ఫ్యాకల్టీల ద్వారా మేనేజిమెంట్ టక్నాలజీ, పవర్ అండ్ ఎనర్జీ, మైనింగ్, సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నామని, వారి సేవలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. పదిహేను రోజులు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో బెంగళూరు లోని నేషనల్ ఏరో స్పేస్ లేబరేటరీ, మణిపూర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, ముంబయి లోని ఇండియా గవర్నమెంట్ మింట్, టాటా ఇనిస్టిట్యూట్ అఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, తెలంగాణ పోలీస్ శాఖ, సెంటర్ ఫోరెన్సిక్ ల్యాబ్ తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పి.సాయి కిషోర్ నేతృత్వంలో జరిగింది.

జ్ఞాన సరస్వతి దేవాలయం లో వసంత పంచమి

నవతెలంగాణ-కల్చరల్



చదువుల తల్లి గా భావించే సరస్వతి దేవీ జన్మ నక్షత్రం వసంత పంచమి కాగా ముషీరాబాద్ వద్ద నున్నశృంగేరి జ్ఞాన సరస్వతి దేవాలయం లో సోమవారం హెూమం ఇతర వేద కార్యక్రమాలు శాస్త్ర బద్ధం గా జరిగాయి పదకొండు వందల పైగా పిల్లల అక్షరాభ్యాసము జరిగినట్లు శృంగేరి పీఠం జ్ఞాన సరస్వతి దేవాలయం ధర్మాధికారి కళా జనార్ధన మూర్తి తెలిపారు వేల మంది అమ్మవారి దర్శనం కోసం వచ్చినప్పటికీ ఎట్టి తొక్కిస లేకుండా భక్తులు అందరూ దర్శనం చేసుకున్నారు అని సహకరించిన పోలీస్ అధి కారులు సిబ్బందికి అయన ధన్య వాదాలు తెలిపారు

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంపొందించే విధంగా అభివృద్ధి

- జీహెచ్ఎంసీ పరిధిలో అహ్లాదక వాతావరణం కల్పిస్తాం
- రూ. 10.09 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలో అహ్లాదకర వాతావర ణం కల్పించేందుకు పెద్ద ఎత్తున బ్యూటిఫికేషన్, పార్కుల అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం పంజాగుట్ట ఎన్.ఎఫ్.సి జంక్షన్ వద్ద రూ.10.09 కోట్ల వ్యయంతో చేపట్టి వివిధ అభివద్ధి పనులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.10 లో రూ. 32 లక్షలతో చిల్డ్రన్ లెర్నింగ్ అండ్ ప్లే పార్కు, రూ. 2.82 కోట్లతో ఎన్.ఎఫ్.సి జంక్షన్ అభివృద్ధి, రూ. 3.80 కోట్లతో పంజాగుట్ట ఫ్లైఓవర్ బ్యూటిఫికేషన్, రూ.3.15 కోట్లతో సోమాజిగూడ జంక్షన్ అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నగర ప్రజలకు అహ్లాదకర వాతావరణం కల్పించేందుకు జీహెచ్ఎంసీ వ్యాప్తంగా జంక్షన్ల అభివృద్ధి, ఫ్లైఓవర్ల కింద వర్టికల్ గార్డెన్‌ల ఏర్పాటు, భావితరాలకు స్ఫూర్తి నిచ్చే విధంగా పెయింటింగ్ వేయడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను మరింత పెపొందించే విధంగా జంక్షన్లను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. తాగు నీరు, వీధి దీపాలు, శానిటేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు రివ్యూ చేసి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో నీటి సరఫరా మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర ప్రజలు సూచనలు సలహాలు ఇస్తే మరింత అభివద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... నగరంలో బ్యూటిఫికేషన్ పనులతో పాటు శానిటేషన్ ను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా ఎన్ ఫోర్స్ మెంట్ విభాగంతో గట్టి నిఘా ఏర్పాటు చేసి నివారించడం జరిగిందని అన్నారు. ఇప్పటి వరకు సుమారు 42 లక్షల రూపాయలను ఛలాన్ వేయడం జరిగిందని తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్స్, వ్యాపార సముదాయాల వద్ద డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జీవీపీలను శాశ్వతంగా తొలగించేందుకు బిన్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిల సహకారంతో శానిటేషన్ పై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, సోమాజీగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్, ఎస్.ఇ రత్నాకర్, ఈఈ లు విజయ్ కుమార్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కథక్ నాట్య గురు రాఘవ రాజ్ భట్ కు మధ్య ప్రదేశ్ రాష్ట్ర తులసీ సమ్మాన్ పురస్కారం

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ కథక్ నాట్యగురు రాఘవరాజ్ భట్ కు మధ్య ప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక తులసి సమ్మాన్ లభించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి యేటా వివిధ రంగాల్లో విశిష్ఠ సేవలు అందించిన వారిని గుర్తించి గౌరవించే జాతీయ పురస్కారం తులసి సమ్మాన్ కు తెలుగు రాష్ట్రాల నుంచి రాఘవ రాజ్ భట్ ను ఎంపిక చేయడం విశేషం. తులసి సమ్మాన్ జాతీయ పురస్కారంతో రాఘవ రాజ్ భట్ ను మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ సి. పటేల్ ఘనంగా సత్కరించారు. భారత్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా జానపద కళలకు ఆయన అందిస్తున్న సేవలకు ఈ పురస్కారం లభించింది. తెలుగు జానపద కళాబ్రహ్మ డా. గోపాల్ రాజ్ భట్ వారసుడు రాఘవ రాజ్ భట్. భారతీయ జానపద కళలను పరిరక్షిస్తూ పరివ్యాప్తి చేస్తూ విశేష సేవలు అందిస్తున్నారు. మహబూబ్ నగర్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల లో ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు. కథక్, జానపద కళలకు అంకితమై జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. పద్మవిభూషణ్ పండిట్ బిర్జు మహారాజ్ దగ్గర శిష్యరికం చేసి ఉత్తరాది కథక్ నృత్యాన్ని దక్షిణాది రాష్ట్రాల్లో విస్తృత ప్రాచుర్యము కల్పించారు. వారి భార్య మంగళ భట్ కూడా ప్రముఖ కథక్ నాట్యగురుగా అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇరువురు ఆర్టిస్టిక్ డైరెక్టర్లు గా, కథక్ నాట్యగురువులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ, సిసిఆర్టీ, ఐసీసీఆర్ సంస్థల గుర్తింపు పొంది గత మూడున్నర దశాబ్దాలుగా వేలాది ప్రదర్శనలు ఇచ్చినట్లు రాఘవ రాజ్ భట్ తెలిపారు. తన తండ్రి గోపాల్ రాజ్ భట్ కు ఈ పురస్కారం అంకితం అని, ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం కళారంగానికి అంకితమై కళల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టింది

- నగర గ్రంథాలయ చైర్మెన్ ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-కల్చరల్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టిందని పోటీ పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి అని నగర గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్ రెడ్డి కోరారు అశోక్ నగర్ లోని నగర కేంద్ర గ్రంథాలయం ప్రాంగణం లో వసంత పంచమి సందర్భం గా సరస్వతి దేవీ కి విద్యార్థులతో కలిసి ఉపేందర్ రెడ్డి పూజలు చేసి మాట్లాడారు వచ్చే సంవత్సరం లోగా అంద రూఉద్యోగులు కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు గ్రంథాలయ కార్యదర్శి పద్మజ ఉద్యోగులు అవినాష్ వేంకటేశ్వర రెడ్డి మహేందర్ తదితరులు పాల్గొన్నారు



నూతన అధ్యక్షునికి ఘన సన్మానం

నవతెలంగాణ-చంపాపేట్

బీజేపీ సైదాబాద్ డివిజన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సూరజ్ అప్పింగీకర్ సోమవారం కార్పొరేటర్ అరుణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూరజ్ అప్పింగికర్‌ను కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. పార్టీ నాయకులు రాజారాం, రవి, శ్రీకాంత్, మహిళా నాయకులు వనజ, విజయ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతి అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన...

పాల్గొన్న సాయి బాబా ట్రస్ట్ కమిటీ చైర్మన్ సుభాష్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్‌బాగ్ లోని ఆర్యుబి వద్ద నున్న సాయిబాబా ఆలయం లో సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం క్రోధి నామ సంవత్సర మాఘ మాసం వసంత పంచమి (శ్రీ పంచమి) సందర్భం గా సరస్వతి దేవికి అభిషేకం, పుష్పర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ట్రస్ట్ కమిటీ చైర్మన్ సుభాష్ మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్దలతో అమ్మవారి పూజలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సాయిబాబా ట్రస్ట్ కమిటీ ఉప ప్రధాన అధ్యక్షులు మనోహర్, కార్యదర్శి సమ్మా రావు, ట్రెజరీ రామకృష్ణ, ఆర్ఎస్ మూర్తి, మల్లికార్జున్, కమిటీ సభ్యులు నాగమురళి, ఆలయ పూజారి సత్య పండిట్, తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి అలవాట్ల వల్లే యూరో-ఆంకలాజికల్ క్యాన్సర్లు

- **ఏఐఎన్‌యూ సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ మహ్మద్ తైఫ్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూత్రకోశ వ్యవస్థతో సంబంధం ఉన్న క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్, కిడ్నీ క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్, వషణాలు, పురుషాంగ క్యాన్సర్ లాంటివి ఉంటాయనీ, గడిచిన రెండు దశాబ్దాలుగా ఈ క్యాన్సర్లు బాగా వేగంగా పెరుగుతున్నాయని ఏఐఎన్‌యూ హైటెక్ సిటీ శాఖలోని సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ మహ్మద్ తైఫ్ బెండిగెరి చెప్పారు. నేడు ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఆయన దీని గురించి పలు వివరాలను వెల్లడించారు. మన దేశంలో ప్రతి 120 మందిలో ఒకరికి ప్రోస్టేట్ క్యాన్సర్ ఉంటోందనీ, ప్రతి 220 మందిలో ఒకరికి మూత్రాశయ క్యాన్సర్, ప్రతి 450 మందిలో ఒకరికి కిడ్నీ క్యాన్సర్లు ఉంటున్నాయని తెలిపారు. దేశంలో ఉన్న అపార జనాభా, ప్రాంతీయ స్థాయిలో చూసుకున్నా ఇది చాలా ఎక్కువగానే కనిపిస్తుందని తెలిపారు. రోగుల్లో ఎక్కువశాతం మంది ఇప్పటికీ బాగా ముదిరిన దశలోనే చికిత్సలకు వెళ్తుండటంతో మరణం సంభవించే ప్రమాదం ఎక్కువవుతోందని తెలిపారు. జీవనశైలి ఎంపికలకు ఇప్పటి వరకు అత్యంత ముఖ్యమైనది ధూమపానం సమస్య. ధూమపానం యూరో-ఆంకాలజికల్ క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచుతుందనీ, ముఖ్యంగా మూత్రాశయం, మూత్రపిండాల క్యాన్సర్ ప్రమాదాన్ని అనేక రెట్లు పెంచుతుందని నిరూపణ అయ్యిందని తెలిపారు. ధూమపానం మానేస్తే మూత్రపిండాలు, మూత్రాశయ క్యాన్సర్లను చాలా వరకు నివారించవచ్చు అనీ, దీనిపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. మన దేశంలో చాలా వరకు ఆలస్యంగా వైద్యుల వద్దకు వెళ్లడం వల్ల క్యాన్సర్ చికిత్స ఫలితాలు సరిగా ఉండటం లేదనీ, దీన్ని అధిగమించడానికి తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా ఉపయోగకరమైన అలవాటు అనీ, దీనివల్ల అలాంటి వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు అనీ, తద్వారా సరైన ఫలితాలను సాధించవచ్చు అని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికి క్రమం తప్పకుండా వార్షిక ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే సరిపోతుంది చెప్పారు.

ప్రేక్షక జన రంజకంగా సత్య సంగీత సంస్థ సంగీత విభావరి



నవతెలంగాణ-కల్చరల్

సాధారణం సినీ పాటలు వేదికలపై గాయనీ గాయకులు పాడుతూ ఉంటే శ్రావ్య మైన గొంతులు వారివి ఐతే శ్రీతలు ఆనందిస్తారు. అదే సమయం లో పాటలతో పాటు ఆ సినిమాలోని దృశ్యాన్ని తెరపై ప్రదర్శిస్తే వీనుల విందైన సంగీతం తో పాటు కను విందు చేసే దృశ్యాలు చూస్తూ వుంటే అలనాడు తాము చూసిన సినిమాలలోని దృశ్యాలు తలచుకుని ముగ్ధులు అవుతారు అదే సంఘటన శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై జరిగింది సత్య సంగీత సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణ లో ప్రముఖ గాయకుడు వై ఎస్ రామ కృష్ణ కామేష్ రేణుక ప్రశాంతి రవీంద్ర నాథ్ ఆశా రాణి వీణ పవన్ తదితరులు నాటి పాటలను ఆలపిస్తున్న సమయం లో ఆ సందర్భం లోని సినిమా లోని దృశ్యాన్ని తెరపై ప్రదర్శించారు శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి బీసీ కమీషన్ పూర్వ చైర్మెన్ డాక్టర్ వకుళ భరణం కృష్ణ మోహన్ రావు తదితర ప్రముఖులు ఆ దృశ్యాలను చూస్తూ పాటలు వింటూ సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా వారు మాట్లాడుతూ ఉత్తమ సాహిత్యం సంగీతం నాటి పాటలను ఇప్పటికీ చిరంజీవులు నిలిచి వుంచేయి అని అన్నారు సత్య సంగీత ఓంకార్ రాజు ఉత్తమ అభిరుచి కల నిర్వాహకుడు అని అభినందించారు వేదిక పై వంశీ రామరాజు హాస్య అవధాని శంకర నారాయణ బి జె పి నాయకుడు వంశీ కృష్ణ సంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు ఓం కార్ రాజు నిర్వహణలో పలువురు సామాజిక చైతన్య మూర్తులు వైద్యులు నటులకు కళాకారులకు అతిథులు ప్రతిభా పురస్కారాలు బహుకరించారు



మాదకద్రవ్యాల నివారణపై అధ్యాపకులకు అవగాహన

నవతెలంగాణ-హాయత్ నగర్

హయత్ నగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్టేట్ లెవెల్ కోఆర్డినేటింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణపై అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అధిక శాతం మంది ప్రధానంగా యువత మాదకద్రవ్యాల బారిన పడి ఆర్థికంగా మానసికంగా,ఆరోగ్యపరంగా నష్టపోయి జీవితాలను కోల్పోతున్నారని తెలిపారు. అటువంటి వారిని చైతన్య పరిచే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఎస్.ఎల్.సి.ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకీ మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్నదని, ఎక్కువగా యువత వాటి బారిన పడి ఎన్నో జీవితాలను కోల్పోతున్నారని, అటువంటివారిని అధ్యాపకులందరూ చైతన్య పరచడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని వివరించారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి వారిని కాపాడడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ రెడ్డి, ఇందిరా, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి నరసింహ, లైబ్రేరియన్ డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ గీత నాయక్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ ఈ యాదగిరి రెడ్డి, డాక్టర్ వి. నాగరాజ్ యాదవ్, డాక్టర్ అపర్ణ చతుర్వేది,ఎస్ నాగేంద్ర తో పాటుగా ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

యూనియన్ బడ్జెట్‌పై అవగాహన సదస్సు

హయత్ నగర్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాలలో వాణిజ్య శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రాజనీతి శాస్త్రాలు, విభాగాల ఆద్వర్యంలో యూనియన్ బడ్జెట్-2025 పై సదస్సు నిర్వహించగాకళాశాల ప్రిన్సిపాల్ డా.. సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు విచ్చేసిన ఫెలో ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్ నర్సింగమ్ మాట్లాడుతూ యూనియన్ బడ్జెట్ - 2025 కేటాయింపులు, ఆదాయం పన్ను స్లాబుల గురించి, వికసిత భారత్ గురించి వివరించారు. ప్రస్తుత బడ్జెట్ వేతన జీవులకు ఊరటనిచ్చిందని, రైతులకు రుణ లభ్యత అవకాశాలు పెంచిందని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థలలో ఎక్కువ మందికి ప్రవేశానికి అవకాశం కల్పించిందన్నారు.క్యాన్సర్ వ్యాది గ్రస్తులకు ఉపయోగపడుతూ మొత్తంగా సంక్షేమం, అభివద్ధి సమ్మిలితంగా ఉందన్నారు. వివిధ విభాగాల అధ్యాపకులు హజరవ్వగా కళాశాల విద్యార్థులకు క్రిజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు.కార్యాక్రమ సమన్వయ కర్త సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

భావోద్వేగాలు అక్షర రూపం కవిత్వం



నవతెలంగాణ-కల్చరల్

కాళ్ళు తడవ కుండా సముద్రాలు దాటే రవాణా సాధనాలు ఉన్నాయి కానీ కళ్ళు తడవకుండా జీవితాన్ని సాగించలేమని నేటి నిజం పత్రిక సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. ప్రతి ఒక్కరిలో భావోద్వేగాలు ఉంటాయని వాటికి అక్షర రూపం ఇచ్చేవారు కవి అని చెప్పారు. త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై మానస ఆర్ట్స్ థియేటర్స్ జి ఏస్ అర్ అండ్ ఫ్రెండ్స్ ఈవెంట్స్ నిర్వహణ లో ప్రముఖ కవి గట్టుపల్లి సీతా రామ రావు రచించిన విచిత్రాలు లఘు కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవ దాసు సంపుటి ఆవిష్కరించి మాట్లాడారు. కవితలు నాలుగు ఐదు పా దాలే ఐనప్పటికి అంతర్లీనంగా ఎంతో భావోద్వేగాలు సీతా రామ రావు లో వున్నాయి అని వివ రించారు తాను విన్న చూసిన ప్రతి అంశాన్ని అక్షర రూపం ఇచ్చారు అని తెలిపారు. అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ మాట్లాడుతూ సీతా రామ రావు కవి మాత్రమే కాదని జర్నలిస్ట్ కార్టూనిస్ట్ గాయకుడు బహు ముఖ ప్రతిభ ఉన్న వారు అని తెలిపారు కవి సీతా రామ రావు తన సంపుటిని లాంఛనం గా కవి రాఘు శ్రీ కి అంకితం ఇచ్చారు



మాజీ మేయర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ శ్రీ సాయి బాలాజీ హెూమ్స్ ఫేస్ 1 కాలనిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. గత 5సంవత్సరాలుగా కార్పొరేటర్ గా మేయర్ గా తమ కాలానికి సేవలందించినందుకు గాను చిగిరింత దంపతులను కాలనీవాసులు పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ తనను కార్పొరేటర్ గా గెలిపించి మేయర్ కావటానికి సహకరించిన కాలనీ వాసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.గత 5సంవత్స రాలుగా కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటం జరిగిందన్నారు..



హరి కథ తెలుగు సంస్కృతిలో ప్రముఖం

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు నాట ప్రజలు ఒక నాడు పురాణ ఇతిహాసాలు తెలుసుకొనేందుకు హరి కథ, బుర్ర కథ వంటి కళా రూపాలు ప్రాచుర్యం లో ఉండేవని ఆంధ్ర ప్రదేశ్ విశ్రాంత ప్రధాన కార్యదర్శి లంక సుబ్రహ్మణ్యం అన్నారు. హరి కథ తెలుగు సంస్కృతిలో ప్రముఖం గా నాడు గుర్తింపు పొందిన దని అయన చెప్పారు. నల్ల కుంట లోని శంకర మఠం లో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంలో జరుగుతున్న హరి కథ సప్తాహం లో భాగంగా వై రమణయ్య భాగవతార్ (పొద్దుటూరు) చే భక్త మార్కండేయ హరి కదా గానం ఆసక్తి కరం గా సాగింది ఈ సందర్భం లో జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లంక సుబ్రహ్మణ్యం భాగవతార్ ను సత్కరించి మాట్లాడారు హరి కథ ను పరిరక్షించుకుంటే తెలుగు సంస్కృతి నీ కొనసాగించటం అన్నారు చారిత్రక నవలా రచయిత డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ ఉత్తములు ఎది ఆచరిస్తే అదే సమాజం అనుసరిస్తుంది అనీ గీతాచార్యుని వాక్యం అని చెప్పారు డాక్టర్ రమణ తన జన్మ దినం పురస్కరించుకుని సంప్రదాయ కళ లకు జాన పద కళలకు ప్రోత్సహం ఇస్తున్నారు అని ఆయనను ఆదర్శం గా అందరూ గ్రహిస్తే సమాజం విలసితం అవుతుంది అని ప్రశంసించారు కిన్నెర రఘురాం స్వాగతం పలికిన సభలో డాక్టర్ రమణ కిన్నెర సభ్యులు సుబ్బారావు వెంకట రావు తదితరులు పాల్గొన్నారు

బిజినెస్

మార్కెట్లకు 'టారిఫ్'ల బెంబేలు
సెన్సెక్స్ 319 పాయింట్ల పతనం



- విశ్వాసాన్ని నింపలేని బడ్జెట్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో మోడీ సర్కార్ బడ్జెట్ విశ్వాసాన్ని నింపలేకపోయింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు నిర్ణయం ప్రపంచ దేశాల మార్కెట్లను ఆందోళనకు గురి చేశాయి. ఎఫ్ఐఐలు తరలిపోవడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ పతనాన్ని చవి చూడటం, వాణిజ్య యుద్ధ భయాలు తదితర కారణాల నేపథ్యంలోనే సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ 319.22 పాయింట్లు లేదా 0.41 శాతం పతనమై 77,186.74కు దిగజారింది. ఇంట్రాడేలో 77,260-76,756 మధ్య కదలాడింది. ఇంట్రాడేలో దాదాపు 700 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 121 పాయింట్ల నష్టంతో 23,361 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్అండ్‌టీ, టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ షేర్లు అధిక లాభాలను నమోదు చేశాయి.

మోతీలాల్ ఓస్వాల్ కొత్త లోగో ఆవిష్కరణ

న్యూఢిల్లీ : మోతిలాల్ గ్రూపునకు చెందిన మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కొత్త బ్రాండ్ లోగోను ఆవిష్కరించింది. దీంతో నూతన శకాన్ని ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. లోగోలోని ఆక్స్‌ఫర్డ్ నీలం రంగు చురుకైన ప్రొఫెషనలిజం, విలువైన వారసత్వం, కాలాతీత స్థిరత్వం, జాగ్రత్తగా పండించిన నైపుణ్యాన్ని తెలియజేస్తుందని ఎంఒఎస్ఎల్ గ్రూప్ ఎండి, సిఇఒ మోతీలాల్ ఓస్వాల్ పేర్కొన్నారు. గత 37 ఏండ్లుగా తాము ఈ రంగంలో ఉన్నామన్నారు. ఈ లోగో ఇప్పుడు కొత్త దృక్పథంతో బలమైన పరిశోధన, సలహాలను అందించడానికి నిబద్ధత కలిగి ఉందన్నారు.

ఈకిన్‌కేర్‌తో జాగల్ భాగస్వామ్యం

హైదరాబాద్ : కార్పొరేట్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌ను అందించడానికి వీలుగా ఈకిన్‌కేర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ లిమిటెడ్ తెలిపింది. ఈ బి2బి సాస్ ఫిన్‌టెక్ కంపెనీ మెడికల్ డయాగ్నస్టిక్స్, డాక్టర్ కన్సల్టేషన్స్, ప్రిస్క్రిప్షన్ టెలిమెడిసిన్స్, డెంటల్ అండ్ విజన్ కేర్, మెంటల్ వెల్నెస్ సపోర్ట్, ఎమర్జెన్సీ మెడికల్ అసిస్టెన్స్, ఫిట్‌నెస్ ఫెసిలిటీస్, హెల్త్ రిస్క్ అసెస్‌మెంట్స్‌ను అందించనుంది. వీటితో పాటు ఎకిన్‌కేర్ ద్వారా అదనపు వెల్నెస్ ఆఫర్‌లతో సహా అనేక రకాల ఆరోగ్య సంరక్షణ సేవలను ఉద్యోగులు పొందగలరని జాగిల్ ఎండీ, సీఈఓ అవినాష్ గొడ్‌ఖిండి తెలిపారు.

నిధుల సమీకరణలో నెట్‌లింక్స్
రూ.85 కోట్ల కోసం బోర్డు ఆమోదం

హైదరాబాద్: ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సర్వీసు సెక్టార్ కంపెనీ నెట్‌లింక్స్ రూ.85 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం సోమవారం తమ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపినట్లు నెట్‌లింక్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్క కోటి ఫుల్ ఆఫ్ పెయిడ్ ఈక్విటీ షేర్లను రూ.85 చొప్పున జారీ చేయడం ద్వారా ఈ నిధులను అందుకోనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రిఫర్షియల్ షేర్ల కేటాయింపునకు గాను 2025 మార్చి 5న ఎక్స్ట్రార్డినరీ జనరల్‌బాడీ మీటింగ్ (ఈజీఎం)ను ఏర్పాటు చేయనున్నట్లు నెట్‌లింక్స్ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్ లోక రెడ్డి తెలిపారు. కంపెనీని మరింత బలోపేతం చేయడానికి, వృద్ధికి మద్దతును అందుకోవడానికి ఈ నిధులను ఉపయోగించనున్నామన్నారు.

సన్‌ఫీస్ట్ నుంచి 'వాఫ్జర్స్' బ్రాండ్



హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ ఐటీకి చెందిన సన్‌ఫీస్ట్ సంస్థ కొత్తగా 'వాఫ్జర్స్' బ్రాండ్ బిస్కట్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. 16 గ్రాముల ప్యాక్ ధరను రూ.5గా, 128 గ్రాముల ప్యాక్ ధను రూ.60గా నిర్ణయించినట్లు ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ సీఈఓ అలీ హారిస్ షేర్ తెలిపారు. సన్‌ఫీస్ట్ వాఫ్జర్స్ అసాధారణమైన 14 లేయర్ పరిపూర్ణమైన క్రాకర్ డిజైన్‌ను కలిగి ఉందన్నారు. దీంతో అభివృద్ధి చెందుతున్న చెందుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలను తీరుస్తామన్నారు.

తస్వ నుంచి ప్రత్యేక వెడ్డింగ్ కలెక్షన్

హైదరాబాద్ : ప్రీమియం సంప్రదాయ మెన్స్ వేర్ బ్రాండ్ తస్వ కొత్తగా 'గ్రాండ్ వెడ్డింగ్ 25' కలెక్షన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇందుకోసం ప్రఖ్యాత డిజైనర్ తరుణ్ తహిలియాని సహకారంతో బెంగళూరుతో ఒక ఎక్స్‌క్లూజివ్ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. రాబోయే రోజుల్లో దక్షిణాదిలో ఇలాంటి మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ కలెక్షన్‌లో అప్లిక్యూ, ముత్యాల అలంకరణలు, 3డి డిటెయిలింగ్ కూడా ఉన్నాయని తస్వా చీఫ్ డిజైన్ ఆఫీసర్ తరుణ్ తహిలియాని పేర్కొన్నారు.

కియా సైరోస్ ఆవిష్కరణ



హైదరాబాద్: కియా ఇండియా కొత్తగా కియా సైరోస్ కారును ఆవిష్కరించింది. దీని ఎక్స్‌షోరూం ధరల శ్రేణిని రూ.8.9-17.80 లక్షలుగా నిర్ణయించింది. ఈ ఎస్‌యువిని పలు అద్భుతమైన ఫీచర్లు, పవర్ ట్రెన్ ఆప్షన్లలో అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఈ మోడల్‌లో 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ వర్షన్ కూడా లభిస్తుందని తెలిపింది.

బీసీ కమిషన్‌కు మరిన్ని అధికారాలివ్వాలి
డిప్యూటీ సీఎం భట్టికి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ కమిషన్‌కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ చేయాల్సిన అవసరముందని ఆ కమిషన్ కోరింది. ఇదే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో బీసీ కమిషన్ చైర్మెన్, సభ్యులు చర్చించారు. బీసీ కమిషన్ 10 ఉమ్మడి జిల్లాల పర్యటన తరువాత వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఇప్పటికే కొన్ని కులాల పేర్ల మార్పుతో పాటు అభ్యంతరాల స్వీకరించిన తరువాత వచ్చిన అన్ని అంశాలను పరిశీలించాయి. వీటిపై చైర్మెన్‌తో పాటు నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ రంగు చర్చించారు.

విజన్లతో అభివృద్ధి జరగదు



సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

ఐదేండ్లలో ఏపీ రాజధాని కట్టలేని వ్యక్తి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారా !

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

నెల్లూరు :విజన్ల పేరుతో రాష్ట్ర అభివృద్ధి జరగదని, గతంలో విజన్ 2020 అని ఏమీ చేయలేకపోయారని, ఇప్పుడు కొత్తగా 2047 ఎత్తుకున్నారని, ఇవన్నీ కార్పొరేట్లకు దోచిపెట్టేందుకేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం)ఏపీ 27వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా నెల్లూరులోని మల్లు స్వరాజ్యం ప్రాంగణం (విఆర్ కళాశాల గ్రౌండు)లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అభివృద్ధి పేరుతో మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కువకాలం ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారని, అప్పుడు ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోవడంలో చంద్రబాబు పాత్ర కూడా ఉందని అన్నారు. తరువాతైనా ప్రత్యేక హోదా తీసుకురాలేకపోయారని, ఇక పెట్టుబడులు ఏం తీసుకువస్తారని ప్రశ్నించారు. ఐదేండ్లు సీఎంగా ఉండి రాజధాని నిర్మించలేని వ్యక్తి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పడంలో అర్థం లేదని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేయడంలో చంద్రబాబు పాత్ర ఉందని, ఐదేండ్లు సింగపూర్ జపం చేసి అమరావతిని జగన్‌కు అప్పగిస్తే, ఆయన మూడు రాజధానుల పేరుతో నాశనం చేశాడని అన్నారు. మరోవైపు వెనుకబడిన ప్రాంతాలకు తాగేందుకు నీరు కూడా ఇవ్వలేకపోయారని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తే లక్షలమంది ప్రజలకు తాగునీరు వస్తుందని, దానికి రూ.2000 కోట్లు వెచ్చిస్తే సరిపోతుందని అన్నారు. ప్రభుత్వం ఆ పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పే అభివృద్ధి పెద్దల కోసమేనని, ప్రజల అభివృద్ధి కాదని అన్నారు. పోర్టుల పేరుతో, పరిశ్రమల పేరుతో నెల్లూరు జిల్లాలోనే వేల ఎకరాలు తీసుకుంటున్నారని, వాటిని ఇచ్చిన రైతులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా భూములిచ్చిన దళితులకు పరిహారం ఇవ్వకుండా బలవంతంగా బెదిరించి లాక్కుంటున్నారని అన్నారు. ఇప్పటి వరకూ నెల్లూరు జిల్లాలో ఎక్కువ ప్రాంతాలకు తాగేందుకు నీరు ఇవ్వలేకపోయారని, ఈ జిల్లా నుండి ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు గతంలోనూ ప్రభుత్వాల్లో ఉన్నారని, ఇన్నేళ్లలో ఎందుకు నీటిని సరఫరా చేయలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు. వారు చెప్పే అబద్ధాలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులో జరిగిన సిపిఎం 27వ మహాసభ ప్రజల హక్కుల కోసం పోరాడేందుకు కార్యాచరణ రూపొందించిందని అన్నారు. ఎక్కడ కష్టం ఉంటే, ఎక్కడ బాధలు ఉంటే అక్కడ సీపీఐ(ఎం) ఉంటుందని ఆయన తెలిపారు.

బెదిరింపులు..కిడ్నాపులు

ఒక చైర్మన్, రెండు డిప్యూటీ మేయర్లు,

మూడు వైస్ చైర్మన్ టిడిపి కైవసం

నెల్లూరు డిప్యూటీ మేయర్‌గా స్వతంత్ర అభ్యర్థి విజయం

మిగిలిన స్థానాలకు నేడు ఎన్నిక



నెల్లూరు : రాష్ట్రంలోని మూడు మున్సిపాలిటీలకు చైర్మన్‌లు, మూడు కార్పొరేషన్‌లకు డిప్యూటీ మేయర్లతోపాటు నాలుగు మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్ పదవులకు సోమవారం జరిగిన ఎన్నికల్లో వైసిపి వారిని కిడ్నాప్ చేయడం, ఎన్నిక జరగకుండా టిడిపి నాయకులు అడ్డుకున్నారు. సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని, ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన రెండు డిప్యూటీ మేయర్లు, నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ల పదవులను టిడిపి కైవసం చేసుకుంది. నెల్లూరు నగరపాలక సంస్థకు డిప్యూటీ మేయర్‌గా స్వతంత్ర అభ్యర్థి ఎన్నికయ్యారు. బుచ్చిరెడ్డిపాలెంలో రెండు వైస్ చైర్మన్ స్థానాల్లో టిడిపి గెలుపొందింది. మిగతా స్థానాలను మంగళవారానికి వాయిదా వేశారు. గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరు స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. వాయిదా పడిన చోట్ల మంగళవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ సంబంధిత అధికారులను ఆదేశించింది.

కేసీఆర్‌కు దమ్ముంటే అసెంబ్లీకి రావాలి

సమగ్ర కుటుంబ సర్వే ఎలా చేశారో చెప్పాలి : ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దమ్ముంటే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే ఎలా చేశారో చెప్పాలని ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ) షబ్బీల్ అలీ సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ సర్వే రిపోర్ట్‌ను పదేండ్లు బయటపెట్టని కేసీఆర్ ముందుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాల కేసీఆర్ తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నది చూడాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌తో పాటు ప్రతిపక్ష నేతల సూచనలు కూడా తీసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని స్పష్టం చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీకి కాస్ట్ సెన్సెస్ మీద నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆయన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు అభినందనలు తెలిపారు. చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్‌కు ధన్యవాదాలు చెప్పారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎవరూ ధైర్యం చేయలేదని గుర్తుచేశారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలనేది రాహుల్ గాంధీ ఆలోచన అనీ, ఆ మేరకు కుల గణనకు క్యాబినెట్ తీర్మానించి ఏడాదిలో పూర్తి చేస్తున్నదని తెలిపారు. ఫిబ్రవరి 3న (నేడు) బీసీల ఉపకులాల శాతాన్ని కూడా క్యాబినెట్ ప్రజల ముందు పెడుతుందని స్పష్టం చేశారు. దీంతో రిజర్వేషన్లలో పెద్ద మార్పు వస్తుందనీ, విద్య, ఉద్యోగ రాజకీయాల్లో రిజర్వేషన్ ఎంత ఇవ్వాలో స్పష్టత వస్తుందని తెలిపారు. దేశ చరిత్రలో ఇంతటి వివరణాత్మ సర్వే ఎక్కడా జరగలేదనీ, కుల సంఘాలకు అనుమానాలుంటే అన్ని వివరాలు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన ఈడబ్ల్యూఎస్10 శాతం రిజర్వేషన్‌తో 50 శాతం సీలింగ్ దాటిందని గుర్తుచేశారు.

యూఎస్ ఎయిడ్ సంస్థకు తాళాలు

- సిబ్బందిని బయటే వుండాల్సిందిగా ఆదేశాలు
- అదో నేర సంస్థ అంటూ మస్క్ వ్యాఖ్యలు



వాషింగ్టన్ : అంతర్జాతీయ అభివృద్ధికి సాయమందించే సంస్థ యూఎస్‌ఎయిడ్ సిబ్బందిని వాషింగ్టన్‌లోని ప్రధాన కార్యాలయానికి వెలుపల వుండాల్సిందిగా సోమవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు వారికి నోటీసులు అందచేశారు. సంస్థను మూసివేసేందుకు అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఆ తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సంస్థలోని కంప్యూటర్ వ్యవస్థలకు దూరంగా వుండాల్సిందిగా రాత్రికి రాత్రి 600మంది ఉద్యోగులకు ఆదేశాలు వెళ్లాయని సంస్థలోని సిబ్బంది చెప్పారు. ఇంకా కంప్యూటర్లపై పనిచేస్తున్న వారికి ఈ మెయిల్స్ అందాయి. సంస్థ నాయకత్వం ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయం భవనాన్ని సోమవారం నుంచి మూసివేస్తున్నట్టు ప్రకటించారు. ఆరు దశాబ్దాలుగా సాగుతున్న యూఎస్ ఎయిడ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థను మూసివేయడానికి ట్రంప్ అంగీకరించారంటూ సోమవారం తెల్లవారు జామున మస్క్ ప్రకటించారు. ఆ వెంటనే ఈ పరిణామాలన్నీ చోటు చేసుకున్నాయి.సంస్థకు సంబంధించిన రహస్య సమాచారం, పత్రాలను మస్క్ తనిఖీ బృందాలకు అప్పగించడానికి ఇద్దరు సెక్యూరిటీ చీఫ్‌లు నిరాకరించడంతో వారిద్దరిని ప్రభుత్వం శలవుపై పంపింది. ఆ నేపథ్యంలో మస్క్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. యూఎస్‌ఎయిడ్ సంస్థ ఒక నేర సంస్థ ఇక దాన్ని తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని మస్క్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా అమెరికా అందించే సహాయ కార్యకలాపాలకు కొత్తగా నిధులు అందించడాన్ని అమెరికా విదేశాంగ శాఖ స్తంభింపచేసింది. అమెరికా విధానాలకు అనుగుణంగా విదేశాలకు చేసే సాయం వుంటోందా లేదా అని సమీక్షలు జరుపుతున్న తరుణంలో ఈ చర్యలు, వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

డబ్ల్యుహెచ్‌ఓ నుండి వైదొలగాలనే నిర్ణయంపై
అమెరికాపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలి



డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ విజ్ఞప్తి

జెనీవా : ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) నుండి వైదొలగాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా అమెరికాపై ఒత్తిడి తేవాల్సిందిగా డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ డాక్టర్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ ప్రపంచ నేతలను కోరారు. దీనివల్ల ప్రపంచ దేశాల్లో అంటువ్యాధులు ప్రబలిన సమయాల్లో కీలకమైన సమాచారం అమెరికాకు అందుబాటులో లేకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం ప్రపంచ దేశాల దౌత్యవేత్తలతో జరిపిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

డబ్ల్యుహెచ్‌ఓకు అతిపెద్ద మొత్తంలో నిధులు అందించే అమెరికా బయటకు వెళ్ళిపోవడం వల్ల తలెత్తే పరిస్థితులను ఎలా సర్దుబాటు చేస్తారో వివరించాలంటూ పలు దేశాలు గత బుధవారం నాటి కీలక బడ్జెట్ సమావేశంలో డబ్ల్యుహెచ్‌ఓను కోరాయి. ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా వుంది. సాధ్యమైనంత త్వరలో మనం ఆ పరిస్థితులను నివారించాలని జర్మనీ దౌత్యవేత్త బిజోర్న్ కమెల్ హెచ్చరించారు.

2024-25 సంవత్సరానికి డబ్ల్యుహెచ్‌ఓకు అమెరికానే అతిపెద్ద విరాళాలు అందించే దేశంగా వుంది. 690కోట్ల డాలర్ల డబ్ల్యుహెచ్‌ఓ బడ్జెట్‌లో 98.8 బిలియన్లు అంటే దాదాపు 14శాతం అమెరికానే అందిస్తోంది. తాజాగా అమెరికా నిర్ణయం వల్ల డబ్ల్యుహెచ్‌ఓ ఆరోగ్య అత్యవసర కార్యక్రమాలు ప్రమాదంలో పడనున్నాయి. ఆనాటి బడ్జెట్ సమావేశంలో డబ్ల్యుహెచ్‌ఓ ఆరోగ్య అత్యవసర కార్యక్రమాలను పరిశీలించినట్లైతే అమెరికా నగదుపైనే భారీగా ఆధారపడినట్లు తెలుస్తోంది. డబ్ల్యుహెచ్‌ఓ యూరప్ కార్యాలయంలోని కార్యకలాపాల్లో 80శాతానికి పైగా కార్యకలాపాలు అమెరికా విరాళాలపైనే ఆధారపడ్డాయి. దాదాపు 40శాతం అత్యవసర కార్యకలాపాలకు అమెరికా నిధులే అందుతాయి. తాజా చర్యల వల్ల మధ్య ప్రాచ్యం, ఉక్రెయిన్, సూడాన్‌ల్లో అత్యవసర ప్రతిస్పందనా చర్యలు ప్రమాదంలో పడతాయని ఆ బడ్జెట్ డాక్యుమెంట్ హెచ్చరించింది. యూరప్‌లో డబ్ల్యుహెచ్‌ఓ చేపట్టే క్షయవ్యాధి నివారణా కార్యకలాపాల్లో 95శాతం అమెరికా నిధులతోనే జరుగుతాయి.



సీపీఐ(ఎం) ఏపీ మహాసభలో
39 తీర్మానాల ఆమోదం

నెల్లూరు : సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ వివిధ అంశాలపై మొత్తం 39 తీర్మానాలను ఆమోదించింది. మొదటి రెండు రోజులూ వివిధ అంశాలపై 24 తీర్మానాలపై చర్చించి ఆమోదించగా, సోమవారం మరో 15 తీర్మానాలను ఆమోదించారు. ప్రజలందరి అభివృద్ధే రాష్ట్ర సమగ్రాభివృద్ధి అని మహాసభ పేర్కొంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయిం చాలని సోమవారం మహాసభ తీర్మానించింది. స్థానిక వనరులను ఉపయోగించి స్థానికంగా పరిశ్రమలను పెట్టాలని; కార్పొరేట్లకు భూములూ, ప్రకృతి వనరులను కట్టబెట్టటం వల్ల ప్రజల అభి వృద్ధి జరగదని పేర్కొంది. పేదలకు భూపంపకం, విద్య వైద్యరంగాల్లో ప్రభుత్వ సేవలను మెరుగు పర్చటం, ప్రత్యేక హోదాతో సహా రాష్ట్ర విభజన హామీల అమలును సాధించాలని డిమాండు చేసింది. ఈ తీర్మానాన్ని రాంభూపాల్ ప్రవేశపెట్టగా, కె.రమాదేవి బలపర్చారు. అనంతరం, మహాసభలో ముందుగానే పంపిణీ చేసిన పలు తీర్మానాలను ప్రభాకర రెడ్డి ప్రవేశపెట్టగా, ఎవి నాగేశ్వరరావు బలపర్చారు. అందరికీ ఇళ్లు, పట్టాలూ ఇవ్వాలని; కౌలు రైతులకు గుర్తింపు, రక్షణ కోసం సమగ్ర చట్టం చేయాలని; వృత్తిదారుల సమస్యలను పరిష్కరించా లని; ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని; సమగ్ర సాంస్కృతిక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని; ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేయాలని, పట్టణ ప్రాంతాల్లోనూ అమలు చేయాలని; రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్లు విడుదల చేయాలని, రాజధాని ప్రాంత ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని; దేవస్థానం, వక్ఫ్, ఇతర ఛారిటీ సంస్థల భూములను పేద, చిన్న, సన్నకారు రైతులకు కౌలుకివ్వాలని; ఉద్యమాల సందర్భంగా పెట్టిన కేసులను ఎత్తి వేయాలని; పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని మహాసభ తీర్మానించింది.

క్యూబాకు వెల్లువెత్తిన సంఘీభావం

ఆరు దశాబ్దాలకు పైగా అమెరికా క్రూరమైన ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కొంటూ సోషలిస్టు స్ఫూర్తిని చాటుతున్న క్యూబా ప్రజలకు సిపిఎం రాష్ట్ర మహాసభలో సంఘీభావం వెల్లువెత్తింది. క్యూబా సంఘీభావ కమిటీ పిలుపు మేరకు ప్రతినిధులు రూ.63,035 నిధిని విరాళంగా అందించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, డాక్టర్ కె.హేమలత, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ జోలె పట్టుకొని విరాళం కోరగా, ప్రతినిధులు ఎవరికి వారు సహాయ నిధి అందించారు. కేవలం 20 నిముషాల్లోనే ఈ నిధి సమకూరింది.

సీపీఎస్ఈయూ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఆర్‌యూపీపీటీఎస్, పీఎల్‌ఏ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం టీఎస్‌సీపీఎస్ఈయూ ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్ర (ఆర్‌యూపీపీటీఎస్), పాలిటెక్నిక్ లెక్చరర్ల సంఘం (పీఎల్‌ఏ) మద్దతు ప్రకటించాయి. సోమవారం హైదరాబాద్‌లో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌ను ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, పీఎల్‌ఏ అధ్యక్షులు జి అంజయ్య, ప్రధాన కార్యదర్శి టి ఉదయ్‌కుమార్ కలిసి మద్దతు లేఖలను అందజేశారు. ఏప్రిల్ ఒకటి నుంచి అమలు కాబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్)ను అడ్డుకోవడానికి చట్టసభల్లో సీపీఎస్ యూనియన్ ఎమ్మెల్సీ ఆవశ్యకమని వారు తెలిపారు. సీపీఎస్ విధానం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతను దెబ్బతీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత స్థిరమైన, సురక్షితమైన భవిష్యత్తు లేకుండా పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశి యాదవ్, మ్యాన పవన్‌కుమార్, దేవరాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆత్మీయ ఆతిథ్యం
అశేష సేవలందించిన 200 మంది

నెల్లూరు : సీపీఐ(ఎం) 27వ రాష్ట్ర మహాసభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతోంది. మూడు రోజులపాటు జరుగుతున్న మహాసభలో 200 మంది వలంటీర్లు ఆత్మీయంగా, ఆప్యాయంగా సేవలందించారు. ఇంటికి బంధువులు వచ్చినట్లు మర్యాదలు చేశారు. బస్సులు, రైళ్లలో నెల్లూరు చేరుకున్న ప్రతినిధులకు రెడ్ సెల్యూట్ కామ్రేడ్స్ అంటూ నవ్వుతూ స్వాగతం పలికారు.. వసతి సౌకర్యం చూపించడంలోనూ.. భోజనాలు వడ్డించడంలోనూ.. రవాణా సౌకర్యం కల్పించడంలోనూ వారి మర్యాదలు ప్రతినిధులు మర్చిపోరు. నెల్లూరు నగరంలో ఎర్రజెండా తోరణాలు, సీపీఐ(ఎం) పార్టీ అగ్ర నేతల ఫ్లెక్సీలు అదుర్స్.. నగరంలో ఎక్కడ చూసినా ఎర్రజెండా పండగే... ఆ విధంగా వలంటీర్లు ముస్తాబు చేశారు.. ఈ టీమ్‌కు సీపీఐ(ఎం) నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ నాయకత్వం వహించారు. భోజనం దగ్గర 60 మంది, రిసెప్షన్ వద్ద 12 మంది, వసతి వద్ద 50 మంది, బహిరంగ సభ ఆవరణలో 40 మంది, సోషల్ మీడియాలో ఎనిమిదిమంది, సమావేశ మందిరంలో 30 మంది వలంటీర్లు సేవలందించారు.

ఫిబ్రవరి 17 నుండి తిరుపతిలో టెంపుల్ ఎక్స్ పో

నవతెలంగాణ-హైదరాబాద్ : అంతర్జాతీయ దేవాలయాల సదస్సు మరియు ఎక్స్పో (ఐటీసీఎక్స్) దాని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండవ ఎడిషన్తో మహోన్నతంగా తిరిగి వస్తోంది. 2023లో దాని ప్రారంభ అధ్యాయం యొక్క అద్భుతమైన విజయం, విస్తృత ప్రశంసలను సంపాదించిన నేపథ్యంలో, ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మద్దతు కూడా లభించింది. ఈ సంవత్సరం, ఈ సమావేశం స్థాయి మరియు పరిధిలో మరింత అద్భుతంగా ఉంటుందని హామీ ఇచ్చింది. ఫిబ్రవరి 17 నుండి 19, 2025 వరకు ఆంధ్రప్రదేశ్లోని పరమ పవిత్రమైన ఆలయ నగరమైన తిరుపతిలో ఇది జరగనుంది. టెంపుల్ కనెక్ట్ (ఇండియా) ద్వారా అభివృద్ధి చేయబడిన ఐటీసీఎక్స్, ప్రపంచవ్యాప్తంగా దేవాలయాల సమగ్ర నిర్వహణకు ప్రత్యేకంగా అంకితమైన ప్రపంచంలోని మొట్టమొదటి ప్రతిష్టాత్మక వేదికగా నిలుస్తుంది, ఇది ఆలయ ఆర్థిక వ్యవస్థ యొక్క పరిపాలన, కార్యకలాపాలు మరియు పురోగతిలో శ్రేష్ఠతను సాధికారపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి నేతృత్వంలో జరుగుతున్న ఈ మైలురాయి కార్యక్రమానికి ప్రసాద్ లాడ్ (ఐటీసీఎక్స్ 2025 చైర్మన్ మరియు మహారాష్ట్ర శాసన మండలి సభ్యుడు) సహ- నాయకత్వం వహిస్తున్నారు. "ఇన్క్రెడిబుల్ ఇండియా" కార్యక్రమం కింద భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గౌరవనీయమైన మద్దతుతో, ఆలయ పర్యాటకం మరియు తీర్థయాత్ర పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో ఈ సమావేశం పరివర్తనాత్మక పాత్ర పోషిస్తుంది. రిజిస్ట్రేషన్లు ఉచితం మరియు ప్రస్తుతం తెరిచి ఉన్నాయి. ఈ పరివర్తన అనుభవంలో భాగం కావడానికి ఆలయ నిర్వాహకులు మరియు ప్రతినిధులు జనవరి 31, 2025 నాటికి ఈ కార్యక్ర మానికి నమోదు చేసుకోవాలని ఆహ్వానించబడ్డారు. ప్రతి ఆలయం నుండి ఇద్దరు ప్రతినిధులు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఖర్చు లేకుండా హాజరు కావచ్చు, వారి వసతి ఈ కార్యక్రమంలో భాగంగా కవర్ చేయబడుతుంది. అదనపు ట్రస్టీలు నామమాత్రపు రుసుముతో చేరవచ్చు మరియు లోతైన పరిజ్ఞానం మరియు సంబంధాలను పొందడానికి కమిటీలో కూడా పాల్గొనవచ్చు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రారంభమైన ఫైర్ వాటర్ నియో

నవతెలంగాణ-హైదరాబాద్ : ఇప్పటికే హైటెక్ సిటీ, మియాపూర్‌లలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ప్రీమియం ఫైన్ డైనింగ్ రెస్టారెంట్ ఫైర్ వాటర్ నియో తమ తాజా రెస్టారెంట్‌ను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వద్ద ప్రారంభించింది. ఈ బార్, కిచెన్ భారతీయ, అంతర్జాతీయ వంటకాలతో పాటుగా వైవిధ్యమైన కాక్‌టైల్ మెనూ అందించనుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు. దాదాపు 150 సీటర్ సామర్థ్యం కలిగిన ఈ రెస్టో బార్‌లో 120 సీటర్ల మల్టీపర్పస్ హాల్ కూడా ఉంది. ఫైర్ వాటర్‌లో లగ్జరీ, సమకాలీన గ్లోబల్ కంఫర్ట్ ఫుడ్‌ను తీసుకువస్తున్నామన్న విష్ణు వర్ధన్ రెడ్డి, యూరోపియన్, ఇండియన్ వంటకాలను అందించనున్నామన్నారు. 2013లో తమ తొలి రెస్టారెంట్ హైదరాబాద్‌లో ప్రారంభమైందన్న ఆయన అసాధారణ భోజన అనుభవాలను నగరవాసులకు అందించడంతో పాటుగా అతిథులకు ఎన్నటికీ నిలిచిపోయే అనుభవాలను తాము సృష్టిస్తున్నామన్నారు.